సహజీవన భావనల పావురాయి


# గీటురాయి

వారపత్రిక 19-7-2024 15/-




## ఎన్ని'కల'ల కాలం

### బరువుల్ని ఎత్తుకోండి! భారంగా మారకండి!!




### ఖుర్ఆన్‌లో మొక్కలు, ఫలాల ప్రస్తావన



# గీటురాయి వారపత్రిక

సహజీవన భావాల పావురాయి

## GEETURAI WEEKLY

Sandesha Bhavanam, Lakkadkot,
Chatta Bazar, Hyderabad-500 002.
Ph: 040-24564583; 24576237
Email : geeturaiweekly@gmail.com
Website: www.tiptrust.in; geeturai.in

సంపుటి: 46 సంచిక: 29 హైదరాబాద్
శుక్రవారం 19 జులై 2024 రూ.15-00
12 ముహర్రమ్ 1446 హిజ్రీ


**తొలిగీటు**

**సంతానంపై తండ్రికి గల హక్కు ఏమిటంటే, సంతానానికి మంచి పేరు పెట్టాలి. వారిని సంస్కార వంతులుగా తీర్చిదిద్దాలి.**

– మహాప్రవక్త ముహమ్మద్ (సఅసం)


**సంపాదకులు**
**ఎస్.ఎమ్. మలిక్**

**అసోసియేట్ ఎడిటర్**
**అబ్దుల్ వాహెద్**

**ఎడిటోరియల్ ఇన్‌ఛార్జి**
**ముహమ్మద్ ముజాహిద్**

**సబ్ ఎడిటర్**
**యాఖూబ్ షర్ఫీ**

గ్రాఫిక్స్
**ఎల్. లక్ష్మీనారాయణ**
**ముహమ్మద్ రఫీఖ్**

సర్క్యులేషన్ మేనేజర్
**అబ్దుల్ జలీల్, 9704317015**

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail: geeturaiweekly@gmail.com**


కథ



15

**భర్త ఆఖరి ఉత్తరం**

## లోపల...


| | |
|---|---|
| నిరాశ నిస్పృహల కాలం? ...... | 04 |
| ఎన్ని'కల'ల కాలం ...... | 05 |
| క్రీడాధన శ్రేష్ఠుడు – 38 ...... | 08 |
| బరువుల్ని ఎత్తుకోండి! భారంగా మారకండి!! ...... | 12 |
| తలపుల అలలు ...... | 17 |
| వెలుగుబాట (తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్ అనువాదం) ...... | 18 |
| అడుగుజాడలు ...... | 19 |
| విలువల కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులు ...... | 21 |
| ఖుర్‌ఆన్‌లో మొక్కలు, ఫలాల ప్రస్తావన ఆరోగ్యానికి ఆలంబన ...... | 22 |
| వైజ్ఞానిక వాస్తవాలు ...... | 25 |
| హత్యలు ... కూల్చివేతలు ...... | 28 |
| ఫ్రాన్సు రాజకీయాల్లో కొత్త శకం ...... | 30 |
| సంక్షిప్త భారతం ...... | 32 |
| సర్వత్రా ...... | 33 |
| సర్వమానవాళికి మార్గదర్శకం – దివ్యఖుర్‌ఆన్ సందేశం ...... | 34 |


### కేసీఆర్ బీసీ రాగం..




జిల్లా కమిటీల్లోన
బీసీలకు పెద్దపీట
నిర్లక్ష్యం చేసినరో
తీస్తరటోయ్ తాట!
మరోసారి చేయరట
గతంలోని తప్పులు
గుర్తించకపోతే మరి
ఉడకవంట పప్పులు!!

– యం.డి. ఉస్మాన్ ఖాన్

# ఆలోచన

## నిరాశ నిస్పృహల కాలం?

ప్రధాని మోడీ రష్యా పర్యటనలో మాట్లాడుతూ భారతదేశం 2014కు ముందు నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయి ఉండేదన్నారు. ఇలా చెప్పడం ద్వారా దేశాన్ని కించపరిచారా? అనే చర్చను పక్కన పెట్టి, ప్రధాని మోడీ చెప్పిన మాటలను మరింత లోతుగా చూడవలసిన అవసరం ఉంది. 2014లో బీజేపీ విజయం తర్వాత సియోల్, షాంఘైలలో మాట్లాడుతూ 2014కు ముందు 70 సంవత్సరాల కాలంలో ఎలాంటి ప్రగతి వికాసాలు లేని దశలో ఉండేదని, గత జన్మలో ఏం పాపం చేశామో భారతదేశంలో జన్మించామని ప్రజలు వాపోయే పరిస్థితి ఉండేదని చెప్పారు. అప్పుడు కూడా ఆయన దేశాన్ని అవమానించారనే విమర్శలు వచ్చాయి. కాని అప్పుడు, ఇప్పుడు ఆయన చెప్పింది ఒక్కటే, తాను ప్రధాని కాకముందు దేశంలో ఏదీ లేదు. తాను ప్రధాని అయిన తర్వాత అన్ని మంత్రమేసినట్లు వచ్చేశాయి. మోడీ ప్రధాని కాక ముందు భారతదేశం, మోడి ప్రధాని అయిన తర్వాత భారతదేశం అనే ఈ అమ్మకపు ప్రకటన మాదిరి వికాస అధ్యాయాన్ని నిశితంగా పరిశీలించే పని మన మీడియా చేయడం లేదు.

అదే రష్యాలో రష్యా సైన్యంలో పనిచేస్తూ, ఉక్రెయిన్‌తో పోరాడుతూ ఒక గుజరాతీ యువకుడు మరణించాడు. భారత యువకుడు రష్యా సైన్యంలో ఏం చేస్తున్నాడు. రష్యా సైన్యంలో కిరాయి సైనికుడిగా పని చేస్తున్నాడా? ఇలాంటి అనేక ప్రశ్నలు మన ముందుకు వస్తున్నాయి. రష్యా ఉదారంగా కోటి ముప్పయి లక్షల పరిహారాన్ని, కుటుంబ సభ్యు లకు రష్యా పౌరసత్వాన్ని ప్రకటించింది. రష్యా సైన్యంలో మరణించిన హెమిల్ తండ్రి అశ్విన్ భాయ్ మంగూకియా మాట్లాడుతూ ఇక్కడ ఈ దేశంలో ఏముందని, మేము రష్యా వెళ్ళిపోతాం అని చెప్పిన మాటల్లోను చాలా ప్రశ్నలున్నాయి. కాని మన మీడియా ఈ ప్రశ్నల గురించి మాట్లాడదు.

దేశంలో ఉద్యోగాలు లేవు. పదేళ్ళ మోడీ పరిపాలనలో నిరుద్యోగం ఎన్నడూ లేని స్థాయికి పెరిగింది. ఇజ్రాయిల్, రష్యాల్లో యుద్ధాలు జరుగుతున్నప్పటికీ బతుకుదెరువు కోసం అక్కడికి పోతున్నారు గుజరాత్, ఉత్తరప్రదేశ్, హర్యానా, రాజస్థాన్ యువకులు. ఒకవైపు మోడీ రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో రష్యా యుద్ధంలో పోరాడుతున్న భారతీయులను సాధ్యమైనంత తొందరగా పంపాలని కోరుతుంటే, మరోవైపు అక్కడ మరణించిన హెమిల్ తండ్రి తాము రష్యాకు వెళ్ళిపోతామని అంటున్నాడు. 2014లో మోడీ ఏమన్నారు? పదేళ్ళు నాకివ్వండి, మీ జీవితాలు మార్చేస్తామన్నారు. ఇప్పుడు ఎలా మారాయి?

భారతదేశంలో 1991లో ఆర్థిక సంస్కరణలు ప్రారంభమయ్యాయి. ఆ తర్వాత ఎన్నడూ లేనంత తక్కువ స్థాయి జిడిపి పెరుగుదల, తలసరి ఆదాయవృద్ధి మోడీ కాలంలోనే ఉంది. ఎన్నడూ లేనంత నిరుద్యోగం కూడా ఇప్పుడే ఉంది. ప్రయివేటు పెట్టుబడులు ఎన్నడూ లేనంత స్థాయికి పతనమయ్యాయి. దేశంలో ప్రజల కొనుగోలు శక్తి పడి పోయినప్పుడు మార్కెటులో కన్సూమర్ వస్తువుల డిమాండ్ కూడా ఉండదు. దేశంలో పరిస్థితి ఎలా ఉందో లేబర్ ఫోర్స్ సర్వే, అన్ ఇన్ కార్పోరేటెడ్ ఎంటర్ ప్రయిజెస్ సర్వే, సిటీ గ్రూప్ రిసెర్చ్ గ్రూప్ అభిప్రాయాలు ఇవన్నీ చెబు తున్నాయి.

మోడీ విధానాలు నిస్సందేహంగా గత పదేళ్ళలో కొందరు బడా కార్పోరేట్లకు లాభాల పంటలు పండించాయి. కాని అత్యధికంగా ఉద్యోగాలు కల్పించే చిన్న, మధ్యస్థాయి వ్యాపారాలు దెబ్బతిన్నాయి. నోట్ల రద్దు, జియస్టీ వంటి చర్యలు ఈ పరిస్థితిని మరింత దిగజార్చాయి. ఇప్పుడు పెద్ద పెద్ద మాల్స్ పెరిగాయి. చిన్న చిన్న కిరణా దుకాణాలు మూతపడ్డాయి. ఈ మార్పు సగటు ప్రజల జీవితాలను నిరాశలో ముంచిందా? సంతోష తరంగాల్లో తేల్చిందా? ప్రజలే ఆలోచించాలి.

అబ్దుల్ వాహెద్



# ఎన్ని'కల'ల కాలం

**వరుసగా** వివిధ దేశాల ఎన్నికల ఫలితాలు వచ్చాయి. కొన్ని దేశాల్లో త్వరలో ఎన్నికలు జరగబోతున్నాయి. ఈ సందర్భంగా వివిధ దేశాల్లో ఈ ఎన్నికల ఫలితాలు మారుతున్న సమీకరణాలను సూచిస్తున్నాయి.

బ్రిటనులో లేబర్ పార్టీ అనూహ్యంగా భారీ విజయం సాధించింది. ఫ్రాన్సు, ఈరానుల్లో కూడా ఫలితాలు అనూహ్యంగానే వచ్చాయి. నిజం చెప్పాలంటే ఇండియాలో కూడా ఎన్నికల ఫలితాలు అంచనాలకు అందలేదు. 2024 సంవత్సరం అంతర్జాతీయ ఎన్నికల సంవత్సరంగా భావించవచ్చు. ఈ సంవత్సరం ప్రపంచంలో దాదాపు 64 దేశాల్లో ఎన్నికలున్నాయి. ముఖ్యంగా ఇటీవల జరిగిన ఎన్నికలు అంటే ఇండియా, బ్రిటన్, ఫ్రాన్సు, ఈరాన్ ఎన్నికలను అమెరికా అధ్యక్షుడు కూడా చాలా జాగ్రత్తగా గమనించిన ఎన్నికలు.

బ్రిటను ఎన్నికల్లో రిషి సునాక్ ఘోరపరాజయం పాలయ్యారు. లేబర్ పార్టీ ఘనవిజయం సాధించింది. లేబర్ పార్టీ నాయకుడు కీర్ స్టార్మర్ ప్రధానిగా మారారు. ఇప్పుడు బ్రిటనులో రిఫార్మ్ యుకే పార్టీ కూడా తన ఖాతా తెరిచింది. అతివాద మతతత్వ పార్టీగా పేరుపడిన ఈ పార్టీ బ్రిటను పార్లమెంటులో ప్రవేశించడం కొత్త పరిణామం. ప్రవాసుల విషయంలో అత్యంత కఠినమైన విధానాలు ఉన్న ఈ పార్టీ ఇప్పుడు లేబర్ ప్రభుత్వం విషయంలో ఎలా వ్యవహరిస్తుందో వేచి చూడాలి. రిషి సునాక్ ఓటమి వల్ల భారత మూలాలున్న మొదటి ప్రధాని ఓడినట్లయ్యింది. కొత్త ప్రభుత్వం ప్రవాసుల విషయంలో కొత్త విధానాలు అవలంబిస్తుందనుకున్నప్పటికీ రిఫార్మ్ యుకే పార్టీ వంటి అతివాద పార్టీల ఒత్తిడి వల్ల ప్రవాసుల పట్ల విధానాల్లో సడలింపులు పెద్దగా ఉండకపోవచ్చు. లేబర్ పార్టీ విధానాలు కశ్మీర్ విషయంలో, ఖాలిస్తాన్ విషయంలో ఇప్పుడు ఎలా ఉంటాయో వేచి చూడాలి. గతంలో లేబర్ పార్టీ వైఖరి మనకు అంత అనుకూలంగా లేదు. భారతదేశంతో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంటు విషయంలో ఇప్పటి వరకు ముందడుగు పడలేదు. లేబర్ పార్టీ ఫ్రీట్రేడ్ విషయంలో సానుకూలంగా ఉన్నట్లు మాట్లాడుతోంది. ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లేదు.

మరోవైపు ఫ్రాన్సు ఎన్నికల్లోను అనూహ్యమైన ఫలితాలు వచ్చాయి. ఫ్రాన్సు అధ్యక్షుడు మాక్రాన్ ముందస్తు ఎన్నికల వ్యూహం బెడిసి

కొట్టింది. గమనించవలసిన విషయమేమిటంటే జూనులో యూరోపియన్ పార్లమెంటు ఎన్నికల్లో మతతత్వ పార్టీలు ముందంజలోనే ఉన్నాయి. అందువల్లనే ఫ్రాన్సులో మాక్రాన్ ముందస్తు ఎన్నికలు ప్రకటించారు. మాక్రాన్ పార్టీ సెంట్రిస్ట్ పార్టీ. మాక్రాన్ బలహీన పడడం వల్ల ఇండియాతో సంబంధాలపై కూడా ప్రభావం పడుతుంది. గత ఐదేళ్ళ కాలంలో మాక్రాన్ ఇండియాతో అనేక ఒప్పందాలు కుదుర్చుకున్న నాయకుడు. ఇప్పుడు ఫ్రాన్సులో బలం పుంజుకున్న మారిన్ లా పెన్ ఫ్రాన్సు ప్రయోజనాలే ముఖ్యం అనే విధానం ప్రకటించారు. ఇండియాకు, ఫ్రాన్సుకు మధ్య వాణిజ్య సంబంధాలపై దీని ప్రభావం ఉంటుంది. పైగా ఫ్రాన్సులో హంగ్ పార్లమెంటు వల్ల అంతర్జాతీయ సంబంధాలపై ప్రభావం ఎక్కువగానే ఉంటుంది.

గమనించవలసిన మరో ముఖ్యమైన విషయం. ఈరాన్ అధ్యక్ష ఎన్నిక. ఈరాన్ అధ్యక్షుడు రైసీ మరణం తర్వాత ఈ ఎన్నికలు జరుగుతున్నాయి. ఇస్రాయీల్ తో ఘర్షణ, హిజాబ్ నిరసనల నేపథ్యంలో జరుగుతున్న ఎన్నికలివి. సంస్కరణావాది మసూద్ పెజిష్కియాన్ ఎన్నిక కూడా అనూహ్యమైనది. నిజానికి ఖొమైనీ కావాలనుకున్న అభ్యర్థి జలీలీ ఈ ఎన్నికల్లో ఓడిపోయారు. అయితే సంస్కరణావాది మసూద్ ఎన్నిక వల్ల అమెరికా ఆంక్షలు తొలగించే వాతావరణం ఏర్పడవచ్చు. పాలస్తీనా విషయంలో, హిజ్బుల్లా విషయంలో మాత్రం ఈరాన్ వైఖరి మారే అవకాశాలు లేవని ఇటీవలి ప్రకటనల వల్ల స్పష్టంగా తెలుస్తోంది.

ఈ ఎన్నికలు ఏం చెబుతున్నాయి. స్పష్టంగా ఈరాన్ ఎన్నికల ఫలితాలు సంస్కరణ, ఉదారవాద వైఖరిని ఓటర్లు ఇష్టపడినట్లు చెబుతున్నాయి. కాని యూరోపియన్ పార్లమెంటు ఎన్నికలు, బ్రిటన్ ఎన్నికలు, ఫ్రాన్సు ఎన్నికలు ఏం చెబుతున్నాయి? బ్రిటన్, ఫ్రాన్సు ఎన్నికల తర్వాత అతివాద మతతత్వ పార్టీలను ప్రజలు తిరస్కరించి సెంట్రిస్ట్ పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారనే విశ్లేషణలు కూడా కనిపించాయి. మరికొందరు వామపక్ష పార్టీల వైపు మొగ్గు చూపుతున్నారనే వాదన కూడా వినిపిస్తున్నారు. నిస్సందేహంగా బ్రిటనులో, ఫ్రాన్సులో అతివాద మతతత్వ పార్టీలకు ఎదురుదెబ్బలు తగిలాయి. ఇదే పరిస్థితి మనకు ఇక్కడి ఎన్నికల్లోను కనిపించింది. కాని ఇది సైద్ధాంతిక విజయంగా భావించే పరిస్థితి లేదు. బ్రిటనులో ఓటర్లు లేబర్ పార్టీ విధానాలు సిద్ధాంతాలకు ఓటు వేశారా? చార్ సౌ పార్ విజయాలు సాధించినప్పటికీ లేబర్ పార్టీ అనేక చోట్ల చాలా తక్కువ మార్జిన్‌తో విజయాలు సాధించింది. మొత్తం 34 శాతం ఓట్లు మాత్రమే లేబర్ పార్టీకి లభించాయి. నిజం చెప్పాలంటే కన్సర్వేటివుల 14 సంవత్సరాల పాలన పట్ల బ్రిటీషు ఓటర్లలోని విసుగు ఈ ఎన్నికల ఫలితాల్లో కనిపించింది. అందువల్లనే పోలింగ్ శాతం కూడా పడిపోయింది. బ్రిటనులో మతతత్వ రిఫార్మ్ యుకే పార్టీకి పదిశాతం ఓట్లు లభించాయన్నది గమనించాలి. బ్రిటను ఓటర్ల మనోభావాలు మారాయని, సైద్ధాంతిక స్థాయిలో మార్పు వచ్చిందని అనుకునే అవకాశాలు లేవు.

ఇదే పరిస్థితి మనకు ఫ్రాన్సులోను కనిపిస్తుంది. మాక్రాన్ రినైసెన్స్ పార్టీకి పెద్ద దెబ్బ తగిలింది. వామపక్షాలు అనూహ్య విజయాలు సాధించాయి. ఎవరికీ నిజానికి మెజారిటీ లభించలేదు. ఫ్రాన్సులో కూడా యాంటి ఇంకుంబెన్సీ ఫలితాల్లో కనిపించింది. ఈ ఎన్నికల ఫలితాలను గమనిస్తే ఏదో ఒక ప్రత్యేక సిద్ధాంతం పట్ల మొగ్గు అనేది ఏమీ కనిపించడం లేదు. నిజానికి యూరోపియన్ పార్లమెంటు ఎన్నికల్లో అతివాదులదే పైచేయి అయ్యిందన్నది కూడా గమనించాలి.

ఇక్కడ కూడా ఎన్డీయే బలహీనమయ్యింది. బీజేపీ బలహీనపడింది. కాని భారత రాజకీయాల్లో కూడా గమనించవలసిన విషయమేమిటంటే, ఇప్పటికి కూడా మతతత్వ ప్రచారం వల్ల చాలా పెద్ద స్థాయిలో ఓటర్లు ప్రభావితమయ్యారు. 2019లో బీజేపీకి 37.3 శాతం ఓట్లు లభించాయి. 2024లో 36.6 శాతం ఓట్లు లభించాయి. అంటే ఓట్ల శాతంలో తగ్గుదల ఒక్క శాతం కూడా లేదు.

బ్రిటనులో కాని, ఫ్రాన్సులో కాని, ఇక్కడ కాని ఎన్నికల్లో సైద్ధాంతిక విజయాలనేవి ఏవీ లేవు. ఓటర్లలో విసుగుదల, నిరాసక్తతలే ఈ ఫలితాలకు కారణాలు. ఇక్కడ ఎన్నికల ప్రచారాన్ని గమనిస్తే కూడా మనకు ఈ వాస్తవాలు బోధపడతాయి. ఇక్కడ ఎన్నికల ప్రచారంలో బీజేపీ నేతలు బాహాటంగా, నిస్సంకోచంగా ఇస్లామోఫోబియా ప్రచారం చేశారు. ముస్లిం విద్వేష వ్యాఖ్యలు చేశారు. మరోవైపు రాహుల్ గాంధీ కాని, ఇండియా కూటమి నేతలు కాని ఈ ఇస్లామోఫోబియాను ప్రత్యక్షంగా ఖండించలేదు. ముస్లిములు ఎదుర్కొంటున్న పరిస్థితుల గురించి ఈ నేతలెవ్వరు మాట్లాడలేదు. అభివృద్ధి, అధికధరలు, నిరుద్యోగం వంటి సమస్యలను ప్రస్తావించడం నిస్సందేహంగా అభినందించదగిన విషయం. కాని సమాజంలో చిచ్చు పెడుతున్న మతతత్వాన్ని ప్రత్యక్షంగా ఖండించడం, సెక్యులర్ విలువలను బలంగా ప్రచారం చేయడం, ముఖ్యంగా అణిచివేతకు, హింసాకాండకు గురవుతున్న ముస్లిం సమాజం గురించి మాట్లాడడం చేయలేదు. ఓటర్లు ఆగ్రహిస్తారనే భయం దానికి కారణం కావచ్చు. ఓటర్లు ఆగ్రహిస్తారనే భయం ఈ పార్టీల్లో ఉందంటే అర్థం సమాజంలో మతతత్వ నెరేటివ్, డిస్కోర్స్ చాలా బలంగా ఉందనే కదా. ఈ నెరేటివ్, డిస్కోర్స్ మారలేదంటే సైద్ధాంతికంగా ఏదో మార్పు వచ్చిందని చెప్పలేము.

లోక్ సభలో ఈ మార్పు మొదటిసారి రాహుల్ గాంధీ ప్రసంగంలో కనిపించింది. ఆయన సూటిగా, స్పష్టంగా, మొదటిసారి దేశంలో ముస్లిములు ఎదుర్కొంటున్న పరిస్థితి గురించి మాట్లాడారు. అంతే సూటిగా, స్పష్టంగా మతానికి, మతతత్వానికి మధ్య తేడా గురించి మాట్లాడారు. ఈ నెరేటివ్ మరింత బలంగా ప్రజల్లోకి వెళ్ళాలి. రానున్న ఐదు సంవత్సరాల కాలంలో ఈ మార్పు సాధించే దిశగా రాహుల్ నేతృత్వంలోని కాంగ్రెసు ప్రయత్నిస్తుందా? వేచి చూడాలి. ✦

## 90 శాతం గాజా ప్రజలు నిరాశ్రయులయ్యారు : యూఎన్‌ఓ వెల్లడి



గాజాలో 90 శాతం మంది ప్రజలు తమ ఇళ్లను కోల్పోయి నిరాశ్రయులయ్యారని, ఐక్యరాజ్య సమితి తెలిపింది. గాజాలో ప్రతి 10 మందిలో 9 మంది నిరాశ్రయులయ్యారని అంచనా. ముఖ్యంగా పిల్లలు, త్రాగు నీటికోసం రోజూ గంటల తరబడి క్యూలలో నిలబడాల్సి వస్తోందని యూఎన్‌ఓ తెలిపింది. క్యాంపులలో నివాస ముంటున్న గాజా ప్రజలను మాటిమాటికీ ఖాళీ చేయించడంతో అత్యంత దీనావస్థలో గడపాల్సి వస్తోంది. యునైటెడ్ నేషన్స్ ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్, యూఎన్‌ఓ శాటిలైట్ సెంటర్ సంయుక్త అంచనా ప్రకారం గాజాలో 57 శాతం వ్యవసాయ భూమి దెబ్బతిన్నది. కూరగాయలు, నిత్యావసరాల తీవ్ర కొరత ఉందని, గాజా ప్రజలు అత్యంత దుర్భర పరిస్థితిల్లో జీవిస్తున్నారని యూఎన్‌ఓ పేర్కొన్నది.

## యూకే పార్లమెంటులో పెరిగిన ముస్లిముల ప్రాతినిధ్యం



యునైటెడ్ కింగ్ డమ్ బ్రిటన్‌లో ఇస్లామోఫోబియా ఎంతగా ప్రచారం చేస్తున్నారో ఇస్లామ్ పట్ల సానుకూల దృక్పథమూ పెరుగుతోంది. యూకే పార్లమెంటులో పెరిగిన ముస్లిమ్ ప్రాతినిధ్యమే ఇందుకు నిదర్శనం. ఇటీవలె కాలంలో పాశ్చాత్య దేశాల్లో ఇస్లామ్‌పై, మస్లిముల పట్ల విద్వేషం పెరుగుతోంది. అమెరికా, యూరప్ దేశాల్లో ఇస్లామోఫోబియా ఎక్కువగా ఉంది. యూకే, ఫ్రాన్స్ దేశాల్లో అతివాద పార్టీలు ఓటమిపాలయ్యాయి. బ్రిటన్‌లో ఇస్లామోఫోబియా ఉన్నప్పటికీ ఇటీవలి బ్రిటిష్ పార్లమెంటరీ ఎన్నికల్లో 25 మంది ముస్లింలు హౌస్ ఆఫ్ కామన్స్‌కు ఎన్నికయ్యారు. ఇది రికార్డు స్థాయిలో ఎన్నిక. పలు స్థానాల్లో స్వతంత్ర అభ్యర్థులు విజయం సాధించారు. వారిలో లీసెస్టర్ సౌత్‌లో షౌకత్ ఆదమ్, డ్యూస్‌బరీలో ఇక్బాల్ ముహమ్మద్, బ్లాక్‌బర్న్‌లో అద్నాన్ హుస్సేన్ మరియు బర్మింగ్‌హామ్ పెర్రీ బార్‌లో అయూబ్ ఖాన్ గెలిచారు.

2019లో 19 సీట్లు, 2017 ఎన్నికల్లో 15 సీట్లు గెలుచుకోగా ఈ సంఖ్య ఇప్పుడు 25కు పెరిగింది. బ్రిటన్లో 3.4 మిలియన్ల ముస్లిమ్ జనాభా ఉన్నారు. బర్మింగ్‌హామ్ హాడ్జ్ హిల్‌లో అత్యధిక ముస్లిం జనాభా 62% ఉంది. ఎన్నికల్లో గెలుపోటములు నిర్ణయాధికారం శాసించేస్థాయిలో ముస్లిములున్నారు. ఎనిమిది మంది ముస్లిమ్ అభ్యర్థులు తొలిసారి పార్లమెంటుకు ఎన్నికయ్యారు. గెలిచిన 25మంది అభ్యర్థుల్లో 15మంది లేబర్ పార్టీ నుంచి, నలుగురు స్వతంత్ర, ఇద్దరు కన్జర్వేటివ్ పార్టీ నుంచి గెలుపొందారు.

అధ్యాయం -14

38

# క్రీడా ధన శ్రేష్ఠుడు

ఎస్.ఎమ్. మలిక్

## 2. ఆకలి దప్పులు - ఖలీఫా భాగ్యం!

ఖలీఫా ఉస్మాన్(ర) ఇంటి పైన దొమ్మి జరిగిన రోజుల్లో ఆయన ఇంట ఆహార పదార్థాలు ఏవీ చేరలేకపోయాయి, ఆయన పస్తులున్నారు. వాస్తవం ఏమిటంటే కొన్నేళ్ల క్రితం ప్రవక్తశ్రీ(స) కాలంలో క్షామం ఏర్పడితే, సిరియా నుండి వచ్చిన ధాన్యం మొత్తం మదీనా వాసుల ఆకలి తీర్చడానికి ఆయన విరాళంగా ఇచ్చి వేశారు. ఆయన ఇంటికి కొన్నాళ్ళుగా మంచినీటి చుక్క ఒక్కటీ చేరడం లేదు. నిజానికి కొన్నేళ్ల క్రితం ప్రవక్త కాలంలో 'బీ'ర్ రూమా' అనే మంచినీటి బావిని కొని, ఈ మదీనావాసుల దాహార్తిని తీర్చడానికే ఆయన అంకితం చేశారు!... అయినా ఇదీ ఆనాడు ఆయన పరిస్థితి!!

హిజ్రీ 35వ సంవత్సరం, జీకఅదా నెలలో యూదులు, తమ వంశానుగత ప్రాచీన సంప్రదాయాన్ని అనుసరించి సత్య ధర్మం విరోధంలో ప్రారంభించిన ఉద్యమం ఆ కాలపు ముస్లిమ్ శక్తిని బాగా దెబ్బ తీసింది. నిజానికి ఆ శక్తి చైనా గోడను గడగడలాడించిన శక్తి, దాని ఉధృతికి అట్లాంటిక్ మహాసముద్రంలో తుఫానులు చెలరేగాయి, దాని ప్రకోపానికి కిస్రా(పర్షియన్ చక్రవర్తి) రాజభవన గోపురాలు పడిపోయాయి. ఆ శక్తి నాయకులు ఉస్మాన్(ర) ఖిలాఫత్ కాలంలో ప్రపంచ క్రూర నాయకుల్లో వణుకు పుట్టించారు. దాని ధాటికి ఓ పక్క ఈరానీయుల కపట దైవత్వం తునాతునకలయింది, మరోవైపున రోమనుల గుత్తాధిపత్యం, భూమీ సంద్రాల పై నుండి పటాపంచలయింది. అటువంటి శక్తి తన ప్రవక్త నిర్దేశనకు, దైవ ప్రసన్నతకు లొంగి, మదీనాలో ఓ చిన్న గూటి వరకు పరిమితమయి పోయింది. ఆయన గవర్నర్లు విభిన్న ప్రదేశాల్లో సాధించిన విజయాలు, అలెగ్జాండర్(గ్రీకు), దెరేయస్(పర్షియా)ల విజయ గాథల కన్నా అధికంగా వినుతి కెక్కాయి.

అటువంటి ఖలీఫా సమక్షంలో బద్ర్, ఉహుద్, హునైన్, అహ్జాబ్ వంటి పోరాటాల్లో తమ సత్తా చూపిన కరవాలాలు నిలిచి, "ఆదేశించండి ఏదయినా చేయగలము" అని అర్థిం చాయి. ఆయన ఏ మాత్రం తొణక్కుండా, "నేను ప్రవక్తశ్రీ(స) ముందే తెలిపిన ఈ ఉపద్రవంలో పాలు పంచుకోలేను, అటువంటి సందర్భంలో సహనం వహించాలని ఆయన(స) నన్ను బోధించారు" అని మాత్రమే పలికారు.

### హదీసులు

ఖలీఫా ఉస్మాన్(ర) పైన ప్రస్తావించిన హదీసు బుఖారీ

గ్రంథంలో అనేక శీర్షికల క్రింద ఉల్లేఖించబడి ఉంది. మహనీయ ఉస్మాన్(ర) ప్రస్తావన ఉన్న మేరకు ఆ హదీసు ఇక్కడ ఉటంకిస్తున్నాము :

“తరువాత ఓ వ్యక్తి తోట ద్వారం వద్దకు వచ్చి తలుపు తట్టాడు. నేను(అబూ మూసా అష్అరీ) అడిగాను, ఎవరు? అని. ‘నేను ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్?’ అని బదులిచ్చారు ఆ వ్యక్తి.

‘అయితే కాస్త ఆగండి,’ అని చెప్పి నేను దైవ ప్రవక్త(స), ఆయనకు తోడుగా మహనీయులు అబూ బక్ర్, ఉమర్ కూడా ఉన్న చోటికి వెళ్ళి తెలిపాను. ప్రవక్తశ్రీ, ‘ఆయన్ని లోనికి పంపించు’ అని ఆదేశించారు. ఇంకా ఇలా అన్నారు, ‘ఆయనకు ఎదురు కానున్న హంగామా పట్ల స్వర్గం శుభ వార్తను అందజెయ్యి, దానికి సహనం వహించవలసిందని కూడా చెప్పు’ అన్నారు. నేను ఆయన వద్దకు వెళ్లి చెప్పాను, ‘లోనికి వెళ్లండి, ప్రవక్త మీకు రానున్న ఓ విపత్తు పట్ల స్వర్గం శుభవార్త నిచ్చారు’ అని. మహనీయ ఉస్మాన్ శుభవార్త విని దైవానికి కృతజ్ఞతలు అర్పించుకున్నారు. ఇంకా ‘దైవమే సహాయ పడేవాడు’ అన్నారు.” (బుఖారీ : కితాబుల్ మనాకిబ్: బాబ్ మనాకిబ్, అబీ బక్ర్)

విరోధులు చుట్టుముట్టిన రోజుల్లో ఒక నాడు ఖలీఫా ఇంటి కప్పు పైకి ఎక్కి అల్లరి మూకను సంబోధించారు. ఆయన ప్రసంగం క్లుప్తంగా ఇది :

“జనులారా! మీరు నా ప్రాణం మీదికి ఎందుకు ఎగబడుతున్నారు? నేను ముస్లిముల ఖలీఫాను, ప్రవక్తశ్రీ సహచరుణ్ణి, ముస్లిమ్ సముదాయంలో ఒక వ్యక్తిని. నేను చేసిన తప్పు ఏమిటో ఎందుకు మరణ శిక్షను ప్రతిపాదిస్తున్నారో? దైవం సాక్షిగా, నాకు సాధ్యమయినంత వరకు నేను సేవ చేయడానికి, సంస్కరణ కొరకు మాత్రమే ప్రయత్నం చేశాను. అయినా తప్పులు చేయని అమాయకుణ్ణని చెప్పను. నేను జీవితాంతం తప్పుల క్షమాపణకు సదా దైవం సమక్షంలో వేడుకుంటూ ఉంటాను. జనులారా! జాగ్రత్తగా వినండి, ఒకవేళ మీరు నన్ను చంపి వేసినట్లయితే గుర్తుంచుకోండి, ఇక ప్రళయం వరకు ఒక్క నాడూ కలిసి నమాజ్ చేసుకోలేరు, కలిసి, ఒకరికి మరొకరు తోడయి దైవ మార్గంలో సతత సమరమూ జరపలేరు.”

మహనీయ ఉస్మాన్(ర) దౌర్జన్యాల పాలయిన రోజుల్లోని ఈ ప్రసంగం భవిష్యవాణిగా పరిణమించింది. ఎందుకంటే ఆయన అమరగతి పొందటం వల్ల ఇస్లామీయ సమైక్యతలో ఏర్పడిన పగుళ్ళు నేటికీ మరమ్మతు కాలేక పోయాయి. ఆయనకు ఈ ఉపద్రవంలో అగుపడుతున్న వినాశకర దృశ్యాలు, ఆయన సముదాయానికీ ఎత్తి చూపాలని తద్వారా సముదాయాన్ని కాపాడాలని కోరుకున్నారు. అందు వల్ల మరొక రోజు కూడా కల్లోల జనులకు బోధపరచాలని నిలబడ్డారు:

## మరో ఉద్బోధ

“నేను కేవలం ప్రవక్త సహచరుల్ని, ఒట్టు పెట్టి అడుగుతున్నాను, మరొకరిని కాదు. వారే జవాబు ఇవ్వాలి, ఇతరులు స్వయంగా వినగలరు. ఈ విషయం ఎవరికయినా గుర్తుందా? ఓ దినం ప్రవక్తశ్రీ ఉహుద్ కొండ పైన ఎక్కినప్పుడు అది కదల సాగింది. ప్రవక్త మహనీయులు దానికి ఓ ఎదురు దెబ్బ వేసి, “ఉహుద్! శాంతించు. నీ పైన ఒక దైవప్రవక్త, ఓ నిర్ధారణాగ్రేసరుడు, ఇద్దరు అమరగతి పొందే వారున్నారు.’ అన్నారు. అప్పుడు దైవ ప్రవక్తకు తోడుగా నేను, మహనీయులు అబూ బక్ర్, ఉమర్ ఉన్నాము.” అక్కడున్న సహచర మాన్యులు దాన్ని ధ్రువీకరించారు.

ఆ పైన ఆయన ఇలా చెప్ప సాగారు, “నేను బయ్త్ రిజ్వాన్ సందర్భంలో ఉన్న వారినీ ఒట్టుపెట్టి మరీ అడుగుతున్నాను, నేను దైవ ప్రవక్త(స) ఆదేశం ప్రకారం మక్కా బహుదైవారాధకుల వద్దకు వెళ్లినప్పుడు నేను సంహరించబడ్డానని పుకారు లేచినప్పుడు ప్రవక్తశ్రీ(స), నా అన్యాయపరమయిన హత్య ప్రతీకారానికి గాను ముస్లిములందరు తమ ప్రాణాలను అర్పించగలరని ప్రమాణం చేశారు.” సహచర మాన్యులు, ‘అవును, నిజం పలికారు. నిజంగా అలాగే జరిగింది’ అన్నారు.

ఇంకా అడిగారు, “హుదైబియాలో ప్రమాణం చేయించేటప్పుడు, ప్రవక్తశ్రీ తన చెయ్యిని నా చెయ్యిగా నిర్ణయించి నా పక్షాన బయ్త్ జరిగిందని ప్రమాణం చేయించారు. ఇది వాస్తవమేనా?” అని ప్రశ్నించారు. ‘వాస్తవమే’ అని పలికారు జనం. ఆ తరువాత, “ఇక ఆలోచించండి, ఎవరు నా రక్తం చిందించాలని కోరుతున్నారో వారు ఎటువంటి ప్రమాదకర సంకల్పానికి పాల్పడుతున్నారో! నేను సహనం వహిస్తున్నాను, ఉత్తమ సహనానికి ప్రయత్నిస్తున్నాను, ఇంతకూ సద్బుద్ధి ప్రసాదించేది దైవమే” అని ముగించారు.

సమయం సాగుతున్న కొద్దీ హజ్జ్ కొరకు వెళ్లిన వారు తిరిగి వచ్చే సమయం దగ్గర పడుతోంది. పైగా సబాయీలకు విభిన్న ప్రాంతాల నుంచి సైనిక దళాలు వస్తున్న సమాచారం అందు తూనే ఉంది. వాస్తవంగా యూదులయిన సబాయీ నాయకులు, ప్రవక్తల్ని, సదాచారుల్ని సంహరించే తమ దుష్ట ప్రవృత్తి రీత్యా వీలయినంత త్వరగా మహనీయ ఉస్మాన్(ర) జీవితాన్ని తుద ముట్టించాలని అనుకున్నారు.

### ప్రవక్త స్థానం(ఖిలాఫత్) పవిత్రత పట్ల ప్రాణార్పణకు సిద్ధం!

మహనీయ ఉస్మాన్(ర) ఇంటిని అల్లరి మూక చుట్టుముట్టిన రోజుల్లో తిరుగుబాటు దారులు రెండు విషయాలు ఆయన ముందుంచారు, ఖిలాఫత్ నుండి తొలగిపోవాలి. కొందరు కలెక్టర్లను తొలగించి వారి స్థానంలో తిరుగుబాటుదారుల మనుషుల్ని నియమించాలి. లేదా సంహారానికి సిద్ధమవ్వాలి.

మహనీయ ఉస్మాన్ తన స్థానంలో గట్టిగా పట్టుపట్టి తిరుగుబాటుదారుల ప్రతిపాదనలు దేనికీ తలొగ్గ కుండా స్థిరంగా నిలబడ్డారు. ఆయన ప్రాణార్పణకు సిద్ధమయ్యారు కాని ఖిలాఫత్ వ్యవస్థను కొందరు దుండగుల చేతుల్లో ఆట బొమ్మగా మారకుండా, తాము ఇష్ట పడని వారిని, లేదా సముదాయం ఎన్నుకున్న వారిని తొలగించేందుకు లేదా తాము కోరుకున్న వారిని నియమించేందుకు అవకాశం ఇవ్వ లేదు. ఒకవేళ అలా జరిగి ఉంటే అదొక స్థిరమయిన సూత్రంగా మారిపోయే ప్రమాదం ఏర్పడేది.

★★★

## 3. మూడు ప్రత్యామ్నాయాలు

ఖలీఫా పైన దుండగీడు జరుగుతున్న రోజుల్లోనే ఒకనాడు మహనీయ 'ముగైరా(ర) బిన్ షూబా' కొన్ని ప్రతిపాదనలతో మహనీయ ఉస్మాన్ వద్దకు వచ్చారు. దానికి ఉస్మాన్(ర), 'నేను ఏ విధంగానయినా ముస్లిముల పైనుండి ఈ విపత్తును తొలగించేందుకు సముచితమయిన మార్గాన్ని కాదనను, చెప్పండి, ఇంతకూ జరిగేది ఏమయినా అది దైవ నిర్ణయం ప్రకారమే జరుతుంది' అన్నారు.

ఇక ముగైరా, ''మొదటి విషయం, మీరు బయటికి వచ్చి వారిని ఎదుర్కోవలసి ఉంది. మీ పక్షాన సత్యం ఉంది, మీ వద్ద సేనాబలముంది, దౌర్జన్యాన్ని సహించడం సరయినది కాదు'' అన్నారు. సమాధానంగా మహనీయ ఉస్మాన్, ''నేను రక్త పాతం జరిగే విధానం పట్ల దేవుని మన్నింపును కోరుతున్నాను. ముస్లిమ్ సముదాయం ఈ విపత్తు నుండి బయట పడాలంటే జనులు తమ దృక్కోణం మార్చుకోవాలి. వాస్తవికతను అంగీకరించాలి, అంతే కాని కరవాలం వల్ల ఈ సమస్య పరిష్కారం కాదు, ఇంకా ముస్లిమ్ సముదాయంలో ప్రథమంగా పోరుకు ప్రేరేపించే వానిగా నేను మారదలచలేదు.'' ఇంకా ఇలా అన్నారు,

''నాకు విధేయులయిన వారెవరూ పోరాటానికి, రక్త పాతానికి దిగ రాదు.'' ఆ తరువాత ముగైరా, ''మీరు బయట పడటానికి మేము మీ ఇంటిలో నుంచి ఓ రహస్య మార్గం తయారు చేస్తాము, మీరు ఇక్కడి నుండి మక్కాకు వెళ్లిపోండి. ఇలా మీరు ఈ దుండగుల బారి నుంచి తప్పించుకోగలరు'' అన్నారు. మహనీయ ఉస్మాన్(ర) ఈ ఉపాయాన్ని ఎంతో అశ్రద్ధతో విని చిరునవ్వుతో, ''ఏమిటీ, ముగైరా! ప్రవక్త్రశ్రీ(స) స్థానంలో ఉన్న వ్యక్తికి ఇలా దొంగచాటుగా పారిపోవడం శోభిస్తుందా? పైగా నేను పవిత్ర హరమ్ (మక్కా)లో రక్త పాతం జరిగి దాని పవిత్రతకు భంగం వాటిల్లడానికి కారణం కాదలచ లేదు'' అన్నారు.

ఇక మూడవ ప్రతిపాదనగా ముగైరా, ''ఇవి మీకు నచ్చక పోతే మీరు ఎలాగయినా ముఆవియా వద్దకు సిరియా వెళ్ళి పోండి, ఆ తరువాత తాపీగా ఆలోచించి ఏదయినా మార్గం అన్వేషించుకోవచ్చు'' అన్నారు. దానికి ఉస్మాన్(ర), ''నేను ప్రవక్త్రశ్రీ(స) నగరాన్ని, ఆయన సామీప్యాన్ని వదలి ఎక్కడికీ వెళ్ళ లేను, జరిగే దాన్ని ఆపనూ లేను. వీలయినంత వరకు కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నాను. ఇంత మటుకే నా బాధ్యత'' అని ముగించారు.

### అంతిమ ఘడియలు

జిల్ హజ్జ 18వ తేదీన శుక్రవారం. ఆయన రేయింబవళ్ళు దైవధ్యానంలో నిమగ్నమయి ఉండేవారు. ప్రవక్త మహనీయులు ముందే చెప్పి వేశారు గనక ఆయనకు తన అమర గతి పట్ల పరిపూర్ణ నమ్మకం ఏర్పడింది. సహన స్థయిర్యాలతో ఆ ఘడియల కొరకు నిరీక్షిస్తున్నారు. బహుశా ఫలానా దినం అమరగతి ద్వారా నిత్య జీవనం పొందగలనని ఆయనకు తెలిసిపోయిందేమో! ఆయన శుక్రవారం నాడు ఉపవాసం పాటించారు. స్నానం చేసి శుభ్రమయిన దుస్తులు ధరించారు.

ఇరువై మంది బానిసలకు స్వేచ్ఛ కల్పించారు. దైవ గ్రంథం తెరచి పారాయణం మొదలెట్టారు.

ఆ సమయంలో సబాయీలు మహనీయ ఉస్మాన్(ర) ఇంటి లోనికి ప్రవేశించే యత్నం చేయసాగారు. వారు నలువైపులా పరిశీలించి ఇంటి తలుపు పైన దెబ్బ వేయసాగారు. కొందరు సహచరమాన్యులు వారిని ఆపే ప్రయత్నం చేశారు. ఈ ప్రయత్నం ఇంకా కొనసాగుతూ ఉండగానే దుర్మార్గులు తలుపుకు నిప్పు పెట్టారు. దాన్ని పడవేసి ఇంటిలోకి చొరబడ్డారు. వారు సముదాయం నాయకుణ్ణి పదవికి రాజీనామా ఇవ్వవలసిందిగా బలవంతం చేయసాగారు. ఆ సహనమూర్తి తృప్తిగా, "దైవం నాకు ప్రసాదించిన సేవాభాగ్యాన్ని, కొందరు తిరుగుబాటు దారుల పీడనకు లోనయి వదలను. దైవం నాకు తొడిగిన గౌరవ అంగీని తీసి వేయలేను" అన్నారు.

అప్పుడు మహనీయ ఉస్మాన్(ర) దివ్య కుర్ఆన్ తెరిచి 'తాహా' సూరా పఠిస్తున్నారు. ఓ వ్యక్తి ఆయన గడ్డం పట్టుకుని, "దైవం నిన్ను ఘోరంగా పరాభవం పాలుజేయుగాక!" అన్నాడు. అతను తిరిగి, "ముఆవియ, ఇంకా ఎవరెవరో నీవు నమ్మిన వారు, ఇప్పుడు ఎక్కడున్నారో కాస్త చెప్పు!" అని గద్దించాడు. దానికి ఆయన తాపీగా అన్నారు, "అబ్బాయి! పిచ్చి పిచ్చిగా మాటలాడకు, విశ్వాసులయితే కేవలం దైవాన్నే నమ్ముకుంటారు. నేను ఆయన ఆదేశం కొరకే నిరీక్షిస్తున్నాను."

అది విని అతను వెళ్లిపోయాడు. ఆ తరువాత ఇద్దరు వ్యక్తులు అక్కడికి చేరుకున్నారు. ఒకడు ఇనుప చువ్వతో ఆయన తల మీద గట్టిగా కొట్టడంతో రక్తం చింది చుక్కలు ఆయన సమక్షంలో తెరచి ఉన్న కుర్ఆన్ మీద పడసాగాయి. అవి పడిన ఆయత్ పదాలు, 'ఇక దైవమే నీ తోడ్పాటునకు చాలు, ఆయన సర్వం వినేవాడు, సమస్తం తెలిసిన వాడు' (అల్ బకర : 137) అన్నవి. రక్తం బొట్లు పడుతూ ఉండగానే ఆ వ్యక్తి కాలితో తన్ని దివ్య కుర్ఆన్ని క్రింద పడవేశాడు. ఆ పైన మరో వ్యక్తి కరవాలంతో దాడి చేశాడు.

## హత్యా పరంపర

మహనీయ ఉస్మాన్ సతీమణి 'నాయిలా' భర్తను కాపాడటానికి చెయ్యి అడ్డం పెట్టారు, ఆమె మూడు చేతి వ్రేళ్ళు తెగి దూరానపడ్డాయి. ఇంతలో మూడవ వ్యక్తి ప్రవేశించి కరవాలంతో తీవ్రంగా గాయపరచాడు ఖలీఫాను. బహుశా ఆ సందర్భంలోనే ఆయన అమరగతి పొంది ఉంటారు. అప్పుడే ఇంటి నౌకరు ఒకతను ముందుకు వచ్చి ఆయన హంతకుణ్ణి సంహరించాడు. వెంటనే కతీరా అనే ఓ వ్యక్తి ఆ నౌకరును హత్య చేశాడు. అప్పుడు మరో నౌకరు కతీరాతో పోరాడి అతన్ని సంహరించాడు.

ఆయన్ని హత్య చేసిన సమయంలో ఆయన వయసు 82 ఏళ్లు. ఆయన ఖిలాఫత్ కాలం 11 ఏళ్లు, 11నెలల, 17 దినాలు. హత్య తరువాత సబాయీలు ఇంటి సామానంతా దోచుకున్నారు. కడకు మహిళల వంటి పైని నగలు కూడా తీయించుకున్నారు. ఈ దోపిడీ దుండగీడులో ఓ సబాయీ లోనికి వచ్చి ఆయన కళేబరం పైన కూర్చొని పిచ్చిగా ఏడు కత్తి పోట్లు వేశాడు. అప్పుడు ఇంటి మహిళలు అరవడం మొదలెట్టారు. అది చూసి ఓ వ్యక్తి, "ఇక చాలించు, వదిలిపెట్టు" అన్నాడు. అంతలో ఎవరో అరిచారు, "ఇక బైతుల్ మాల్ వైపునకు పదండి" అని. మూక అటు వైపునకు పరుగు తీసింది.

అది హిజ్రీ 35వ సంవత్సరం, జిల్ హజ్జ 18వ తేదీ, (మే నెల, క్రీ. శ 656), శుక్రవారం. ఆనాడే ఈ ప్రళయ సమానం సంఘటనలు సంభవించాయి. ఆ రోజు, ఆ క్షణానే ఇస్లామీయ మిల్లత్ (ముస్లిమ్ సముదాయం)లో విభేదాలకు అంకురార్పణం జరిగింది. సముదాయం ఛిన్నాభిన్నమయి పోయింది. ముస్లిములు పరస్పరం ఒకరి మీద ఒకరు కత్తులు దూయడం ఆనాడే మొదలయింది! ★

వ్యక్తి సంస్కార, సంఘ నిర్మాణ
నైతిక పథకం
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక




మొహియుద్దీన్ గాజీ

**ఇస్లామీయ ఉద్యమానికి** చెందిన ప్రతి సభ్యుడు తన హృదయ నందనంలో ఓ బ్రహ్మాండమైన పరివర్తనా స్వప్నాన్ని అలంక రించి పెట్టుకుంటాడు. ఆ స్వప్నం పట్ల అతనికి గల ప్రేమ వాంఛించేదేమిటంటే, అతడు తాను నివసించే సమాజంలో ఆ స్వప్నాన్ని సాకారం చేసుకోవడానికి శాయశక్తులా ప్రయ త్నించాలి. సముదాయంలోని అత్యధిక మంది ప్రజలు దానిని ఆస్వాదించేందుకు ఈ కృషి అవసరం. ఈ స్వప్నాన్ని తన జీవితపు అతి పెద్ద విలువైన మూల ధనంగా భావిస్తున్నప్ప టికీ, తన ఇంటి వారికి, తన వీధి వారికి కూడా దాని గురించి తెలియకపోవటం కన్నా బాధాకరమైన విషయం మరొకటి ఉండదు. పరివర్తనకు సంబంధించిన కల సమాజంలోని ఎక్కువ మంది కన్నప్పుడే సమాజంలో మార్పు వస్తుంది.

దైవప్రవక్త మహనీయ జకరియ్యా (అలైహిస్సలామ్)కు యహ్యా అనే అబ్బాయి శుభవార్త ఇవ్వబడినప్పుడు, "నీవు మూడు రోజుల వరకూ సైగలతో తప్ప మాట్లాడలేవు. అప్పుడు నీవు నీ ప్రభువును ఎక్కువగా స్తుతించు. ఉదయం, సాయంత్రం ఆయన పవిత్రతను కొనియాడు" *(ఆలె ఇమ్రాన్ - 41)* అని సూచించటం జరిగింది. అందువల్ల మహనీయ జకరియ్యా (అ) తన జాతి వారి వద్దకు వెళ్ళి, "ఉదయం, సాయంత్రం దేవుని పవిత్రతను కొనియాడండి" అని సైగ ద్వారా వారికి హితోపదేశం చేశారు *(మర్యమ్- 11)*.

తాను కనే కలను మొత్తం సముదాయపు కలగా చేయడానికి- కార్యకర్త-సమాజంతో విస్తృతస్థాయిలో సంబంధాలు ఏర్పరచు కోవాలి. ఆ విషయంలో అతను అందరికీ తల్లో నాలుక కావాలి. ఈ వ్యాసంలో ఆ విషయాలనే సూచించే ప్రయత్నం చేశాము-

✦ ✦ ✦

సామాజిక సంబంధం, సంఘ సేవ, సమాజంపై వ్యక్తి ప్రభావానికి సంబంధించిన ఏఏ విషయాలు ఈ రచనలో ప్రస్తావించబడ్డాయో వాటిని ఏదో ఒక రూపంలో ఇస్లామీయ ఉద్యమ కార్యకర్తలు నెరవేర్చగలరు- పురుషులు, స్త్రీలు కూడా! ఇంటి బయట పురుషుల కార్యకలాపాలకు అవకా శాలు మెండు అన్నది నిజమే. అయితే స్త్రీలకు లభించే అవ కాశాలు కూడా తక్కువేమీ కావు. ముఖ్యంగా మహిళా ప్రపం చంలో వారి కార్యపరిధి పురుష ప్రపంచంకంటే ఎక్కువే.

ఈ వ్యాసంలో ఎక్కడ 'సమాజం' ప్రస్తావన వచ్చినా అక్కడ సమాజంలోని వ్యక్తులంతా దృష్టిలో ఉన్నారన్న సంగతి మరువరాదు. - వారు ముస్లింలూ, ఇతర మతావలంబీకులు కూడా. ఇస్లామీయ కార్యకర్తల బాధ్యతేమిటంటే, వారు సమాజానికంతటికీ స్తంభాలుగా నిలబడాలి. వారు పూర్తి సమాజం బరువును ఎత్తుకోవాలి. సమాజంలోని వ్యక్తులంతా వారిని తమ శ్రేయోభిలాషులుగా భావించి, వారిపై నమ్మకం

ఉంచేలా మసలుకోవాలి. ఇదే దైవప్రవక్త(స) వారి ప్రియాతి ప్రియమైన ఆదర్శం! ఇదే ప్రవక్త ప్రియ సహచరుల(రజి) ఆచరణా విధానం!! సమీప మాజీ కాలంలోని ఇస్లామీయ ఉద్యమం కూడా ఉదాహరణ ప్రాయమైన ఈ విధానానికే కట్టుబడి ఉంది.

## బరువుగా మారకండి, బరువును ఎత్తుకునే వారవండి

ఇస్లామీయ ఉద్యమ క్షేత్రం మానవ సముదాయాన్ని తీర్చిదిద్దే క్షేత్రం అని మరువకండి. ఆ మానవ సముదాయంలో పురుషులే కాదు, స్త్రీలూ ఉన్నారు. యువకులే కాదు వృద్ధులు కూడా ఉన్నారు. ముస్లింలే కాదు, ఇతర ధర్మావలంబీకులు కూడా ఉన్నారు. అందులో శ్రీమంతులూ ఉన్నారు, నిరుపేదలు అగత్యపరులు కూడా ఉన్నారు. మానవ సమాజంలో మార్పు తీసుకురావడానికి ఇస్లామీయ ఉద్యమ సభ్యులంతా ఆ సమాజపు దృఢమైన స్తంభాలుగా నిలబడాలి. సమాజ బరువు బాధ్యతల్ని మోయడానికి అందరికన్నా బలమైన, నమ్మకమైన భుజస్కంధాలు వారివేనన్న విషయం రూఢీ కావాలి. దైవప్రవక్త(సఅసమ్) గానీ, ఆయన ప్రాణ స్నేహితుడు మహనీయ అబూబక్ర్(రజి) గానీ సమాజంలోని బరువు బాధ్యతల్ని మోసే విషయంలో ప్రత్యేకంగా జ్ఞప్తికి వచ్చేవారు. దైవప్రవక్త(స) సామాజిక సేవల్ని గురించి ఆయన సతీమణి ఖదీజా(ర.అ) ఇచ్చిన సాక్ష్యమే, మహనీయ అబూబక్ర్(రజి) సేవల్ని గురించి ఒక ముస్లిమేతర వ్యక్తి-ఇబ్నుద్దగినా-ఇచ్చాడు (ఈ రెండు ఉల్లేఖనాలూ సహీహ్ బుఖారీలో ఉన్నాయి)-

**“నిశ్చయంగా మీరు బంధుత్వ సంబంధాలను దృష్టియందుంచుకుంటారు. ఇతరుల బరువును ఎత్తుకుంటారు. అభాగ్యులను ఆదుకుంటూ ఉంటారు. అతిథి మర్యాద చేస్తారు. ప్రకృతి వైపరీత్యాల వాతన పడిన వారికి సహాయం చేస్తుంటారు.”**

దీనిని బట్టి దైవప్రవక్త(స), ఆయన సమీప స్నేహితుడు అబూబక్ర్ తమ సమాజంలో ఎలాంటి కీలకపాత్ర వహించేవారో తెలుస్తూనే ఉంది. తనను దైవప్రవక్తగా ప్రకటించుకోక ముందు - ఒక ముస్లిమేతర సమాజంలో- వారు పోషించిన పాత్ర ఇది. ప్రవక్తగా ప్రకటించుకున్న తరువాత కూడా- గుప్పెడు మంది ముస్లింలు తమ వెంట ఉన్న రోజుల్లో- వారు మక్కాలో సంఘ సేవలో సింహభాగాన్ని తమ భుజ స్కంధాలపై మోసారు.

## సమాజాన్ని సంస్కరించే ఎజెండా

ఇస్లామీయ ఉద్యమానికి చెందిన ప్రతి వ్యక్తి వద్ద, తన సమాజానికి సంబంధించిన ఒక ఎజెండా ఉండాలి. ఏ ఏ రంగంలో తాను ఏ మార్పును చూడగోర్తున్నాడో, దానికి సంబంధించిన స్పష్టత అతని ముందుండాలి. తాను కోరుకుంటున్న పరివర్తనలో కీలకపాత్ర పోషించగల వ్యక్తులకై అతను సదా అన్వేషణ సాగిస్తూ ఉండాలి. ప్రస్తుతమున్న వారిలో ఇలాంటి వ్యక్తులు అతనికి లభించకపోతే టీనేజర్లలోనే ఇలాంటి ప్రతిభావ్యుత్పత్తుల్ని వెతికి, వారినే తీర్చిదిద్దాలి. కోరుకున్న అవకాశాల కోసం ఎదురుచూస్తూ ఉండాలి. వచ్చిన అవకాశాలను దొరకబుచ్చుకోవాలి. తన ఎజెండాకు కార్యరూపం ఇవ్వడానికి వేరెవరు ముందుకు వచ్చినా నిండు హృదయంతో వారికి ఆదరువుగా నిలబడాలి. వారిని శ్లాఘించాలి, వారితో సహకరించాలి.

చెప్పవచ్చిందేమంటే, అతను ఏ పరిసరాలలో నివసిస్తూ ఉన్నా, దానికి సంబంధించిన ఎజెండా అతని వద్ద ఉండాలి. సమాజ పరివర్తనకు సంబంధించిన లక్ష్యమేదీ లేకుండా ఉండకూడదు. అతని దైనందిన జీవితంలో, అతని సంభాషణల్లో ఆ ఎజెండా తొణికిసలాడుతూ ఉండాలి.

## సామాజిక కార్యక్రమాల్లో ముందంజ

సాధారణంగా సమాజంలో జరిగే తప్పుల గురించి ప్రతి ఒక్కరికీ సులభంగా సమాధానం దొరుకుతుంది. కాని సమాజంలో ఏం జరగాలి? దీనికి సమాధానం సుదీర్ఘ ఆలోచన తర్వాతనే లభిస్తుంది. సుదీర్ఘంగా ఆలోచించి, విషయం లోతుల్లోకి పోయి సమాధానం కనుగొనేందుకు ఎక్కువ మంది ముందుకు రారు. అందుచేతనే మనం చూస్తూ ఉంటాం. ఎక్కడ కొంతమంది కలసి కూర్చున్నా వారు సామాజిక, నైతిక రుగ్మతల గురించి చర్చకు తెరలేపుతారు. చాలాసేపు మాట్లాడుకుంటారు. కాని సమాజంలో మార్పు కొరకు ఏం చేయాలి? అన్న దానిపై ఆసక్తి చూపరు. ఈ విషయమై సలహా కోరితే అసలు సబ్జెక్టుపై మాట్లాడకుండా అక్కరకు రాని కబుర్లు చెప్పి నిష్క్రమిస్తారు.
మంచి మార్పు కొరకు ముందుకు వచ్చి అమూల్యమైన సలహాలు ఇచ్చేవారే, వాటికి కార్యరూపం ఇవ్వడానికి తమ వంతు సహకారం అందజేసేవారే సమాజం పాలిట సిసలైన శ్రేయోభిలాషులు. సమాజంలోని ఎన్నో పనులు ముందుకు వచ్చి మొదలెట్టేవారి (Initiators) కొరకు ఎదురుచూస్తూ ఉంటాయి. చాలామందికి ఐడియా తట్టదు. ఐడియా వచ్చే వారిలో దానికి కార్యరూపం ఇచ్చే పట్టుదల ఉండదు.

ఉద్యమంలోని వ్యక్తులకు ఇవ్వబడే శిక్షణ, దేశ కాల పరిస్థితులపై వారికి గల అవగాహన కాంక్షించేదేమిటంటే, వారు సామాజిక కార్యక్రమాల్లో ముందుకు దూసుకుపోవాలి. సలహాలూ ఇవ్వాలి, వాటికి శ్రీకారం కూడా చుట్టాలి. సమాజంలోని ప్రముఖులతో, సమర్థులతో కలసి నెట్‌వర్కింగ్‌లో కూడా పాల్గొనాలి. ఏ కార్యక్రమాలను క్లిష్టతరం అనుకుని ప్రజలు వదిలేస్తున్నారో అవి మీ ద్వారా నెరవేరటం అసంభవమేమీ కాదు.

## మధ్యవర్తిత్వం

సమాజంలో కొంతమంది ఎంతో ప్రభావశీలురుగా పరిగణించబడుతుంటారు. వారు మధ్యవర్తులుగా తమ పని చేస్తుంటారు. ఇదేదో ప్రభుత్వ హెూదా కాదు. పైగా ఇది వారి నిర్దిష్టమైన అభిప్రాయంపై, విషయావగాహనపై ప్రజలకు గట్టి నమ్మకం ఉంటుంది. వారి నిజాయితీ, నిష్పాక్షికతపై ప్రజలు భరోసా చేస్తారు. వారి మధ్య తగాదాలు వచ్చినప్పుడు సయోధ్య కొరకు వారు ఇలాంటి వారి వద్దకే వెళతారు. వీరు సమాజంలో ఎన్నదగిన ఆణిముత్యాలు. ఏ సమాజంలో ఇలాంటి వారు క్రియాశీలక పాత్ర పోషిస్తారో, అక్కడ ఎన్నో వివాదాలు భారీ మూల్యం చెల్లించక ముందే కొలిక్కి వస్తుంటాయి.

ఇస్లామీయ ఉద్యమ చరిత్ర చెప్పేదేమిటంటే, ఎన్నో ప్రాంతాలలో ఉద్యమ కార్యకర్తలకు మధ్యవర్తిత్వం నెరిపే స్థానం ప్రాప్తమై ఉంది. వారిని విజయవంతమైన న్యాయ నిర్ణేతలుగా కూడా జనులు గుర్తించారు.

అందుకే- మీరు చిన్న చిన్న వివాదాలను సజావుగా పరిష్కరించేందుకు యత్నించాలి. ఈ సందర్భంగా మీరు మీ నిజాయితీని, నిష్పాక్షికతను, విషయావగాహనను నిరూపించుకోవాలి. మీరు గనక ఈ పనిని చేస్తూ ఉంటే పెద్దపెద్ద కేసుల పరిష్కారం కొరకు కూడా ప్రజలు మీ వద్దకు వస్తారు.

## కౌన్సిలింగ్ విద్యలో ప్రావీణ్యం

సమాజంలోని ఎందరో వ్యక్తులకు కౌన్సిలింగ్ అవసరం ఏర్పడుతుంది. వారు ఏదో ఒక చిక్కు సమస్యలో కూరుకుని, వ్యాకులతకు లోనై ఉంటారు. ఆ ఊబి నుండి బయట పడటానికి, వారికి వేరొకరి సహాయం అవసరమై ఉంటుంది. కౌన్సిలింగ్ విద్యలో నిపుణులైన వారు ఈ బాధితులకు ఎంతగానో తోడ్పడగలరు. ఉదాసీనత కమ్ముకుని ఉన్న వారి ముఖాలపై సంతోషాన్ని చూడగలరు. నిరాశా నిస్పృహలలో కొట్టుమిట్టాడుతున్న వారికి ఆశావహ దృక్పథంతో జీవించే శుభప్రదమైన వాతావరణాన్ని కల్పించగలరు. నకారాత్మక (Negative) ఆలోచనల యాతన నుండి వెలికి తీసి సకారాత్మక (Positive) ఆలోచనల తీరానికి చేర్చగలరు. దారీ తెన్నూ కానని యువతకు దిశా నిర్దేశన చేయటం, అన్నీ పోగొట్టుకున్నామనే భావనకు గురై ఉన్న వృద్ధుల్లో **"లేదు. మీ దగ్గర ఇంకా చాలా ఉంది"** అనే ప్రోత్సాహభరిత భావనను నింపటం, తెగిపోయి చెల్లాచెదరవుతున్న బంధుత్వాలను ప్రేమ అనే పూలదండలో గుచ్చటం, చేదు జ్ఞాపకాలతో సతమతమయ్యే వారి జీవితాల్లో తీపిని గ్రోలటం, ఎదురు దెబ్బలు తిని పడిపోయేవారికి చేయూతనిచ్చి నిలపటం వంటి పనులన్నీ కౌన్సిలింగ్‌లో ప్రవేశమున్నవారు చేయగలరు.

ఇస్లామీయ ఉద్యమంలోని వ్యక్తులు గనక కౌన్సిలింగ్ విద్యలో ప్రావీణ్యం సంపాదించి, దానిని సద్వినియోగం చేసుకుంటే, వారు సమాజం పాలిట ప్రయోజకులవుతారు. ✤

**(ఇంకా వుంది)**

"జిందగీ-యె-నౌ" సౌజన్యంతో

# అక్షరం....ఆయుధం...!

**డాక్టర్ ముహమ్మద్ హసన్, సెల్ :9908059234**

అంగుళమంత "అగ్గి రవ్వ" "అడవిని" దహిస్తుంది

"**ఆలోచన**" చిన్నదైనా "మనసును" తొలుస్తుంది..!

"**అంకుశం**" చిన్నదైనా "మదగజాన్ని" నియంత్రిస్తుంది..!

"**అద్దం**" చిన్నదైనా "ఆకాశాన్ని" చూపిస్తుంది..!

"**అవమానం**" చిన్నదైనా "ఆత్మవిశ్వాసాన్ని" దెబ్బతీస్తుంది..!

"**జాబిల్లి**" చిన్నదైనా "జగతికి" జ్యోతినిస్తుంది..!

"**పుస్తకం**" చిన్నదైనా "మస్తకం" పై నిలుస్తుంది..!

"**వాన చినుకు**" చిన్నదైనా "జీవకోటికి"
ప్రాణాధారమవుతుంది..!

"**గాయం**" చిన్నదైనా "ప్రాణం" తోడేస్తుంది..!

"**ప్రశంస**" చిన్నదైనా "చరిత్రను" చెక్కుతుంది..!

"**అణుబాంబు**" చిన్నదైనా "విధ్వంసం" సృష్టిస్తుంది..!

"**అక్షరం**" చిన్నదైనా "ఆయుధమై" పోరాడుతుంది"..!

కథ

సేకరణ : ఇమామ్‌జీ



# భర్త ఆఖరి ఉత్తరం...

**(వృద్ధాప్యం దరిచేరిన వారు తప్పక చదవాల్సిన ఓ జరిగిన కథ...)**

పది రోజుల నుండి బంధువులు, పిల్లల తోటి, కర్మకాండలతో హడావిడిగా ఉన్న ఇల్లు ఒక్కసారిగా అందరూ వెళ్లిపోవడంతో నిశ్శబ్దం అయిపోయింది.

ముప్పై ఐదు సంవత్సరాలు ఉపాధ్యాయ వృత్తిలో ఉండి, ఎందరికో విద్యాబోధన చేసి, పిల్లలందరికీ పెళ్లిళ్లు చేసి, రెండు సంవత్సరాల క్రితమే పదవీ విరమణ చేసి, హాయిగా కాలక్షేపం చేస్తున్న శంకరరావు మాస్టార్ సడన్‌గా కాలం చేయడంతో భార్య పార్వతమ్మ ఒంటరిది అయిపోయింది.

పిల్లలందరూ శంకరరావు సార్ రాసిన వీలునామా చదువుకుని హాయిగా ఎవరిళ్లకి వాళ్లు వెళ్లిపోయారు.

ఇక మిగిలింది భార్య పార్వతమ్మ. ఆ ఇంటిలో ఒంటరిగా అయి పోయింది. పిలిస్తే పలికే నాధుడే లేడు.

ఈ శేష జీవితం ఎలా గడపాలా అని ఆలోచనలతో భార్య పార్వతమ్మ శూన్యంలోకి చూస్తూ ఉండిపోయింది.

కడుపున పుట్టిన పిల్లలు వీలునామా ఎలా అమలు జరపాలో ఆలోచించుకుంటున్నారు గానీ, భర్త పోయి పుట్టెడు దుఃఖంలో ఒంటరిగా ఉన్న అమ్మ గురించిన ఆలోచన ఏ ఒక్కరికీ లేదు.

“వెళ్లి వస్తా...”

“ఆరోగ్యం జాగ్రత్త”

“సమయానికి మందులు వేసుకో”

“ఏదైనా అవసరమైతే ఫోన్ చెయ్” .....

అంటూ పిల్లలు మాట వరసకు జాగ్రత్తలు చెప్పి ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు.

మొట్ట మొదటిసారి విపరీతమైన భయంతోపాటు దిగులు పట్టుకుంది.

కళ్ళ నుండి అప్రయత్నంగా కన్నీళ్లు జారాయి.

ఇంతలో..... ‘పోస్ట్’ అని కేక వినబడింది.

ఎవరు రాసుంటారబ్బా ఈ ఉత్తరం అనుకుంటూ అప్రయత్నంగా ఫ్రమ్ అడ్రస్ చూసి ఆశ్చర్యపడింది.

దాని మీద ఫ్రమ్ అడ్రస్ తన భర్త శంకరరావు గారిదే.

చనిపోయిన వ్యక్తి ఎలా ఉత్తరం రాశారనుకొంటూ కవర్ ఓపెన్ చేసి ఉత్తరం చదవసాగింది.

“ప్రియమైన పార్వతికి...

నువ్వు ఆశ్చర్యపడతావని నాకు తెలుసు.

నేను బతికున్న రోజుల్లో రాసిపెట్టిన ఈ ఉత్తరాన్ని ఢిల్లీలో ఏపీ భవన్‌లో పనిచేస్తున్న మన బిడ్డలాంటి నా ప్రియ శిష్యుడు సుబ్రహ్మణ్యం కిచ్చి....

నేను చనిపోయిన తర్వాత పోస్ట్ చేయమని చెప్పాను.

నా మనసులోని మాట నేను బతికినన్నాళ్ళు చెప్పలేకపోయా.

మరణం ఎవరికి ముందు వస్తుందో ఎవరికి తెలుస్తుంది? భర్త

పోయిన భార్య ఈ లోకంలో బతకడం చాలా కష్టం. పైగా పిల్లలందరూ దూరంలో ఉంటారు.

ఒంటరిగా బ్రతకాలంటే నీకు చాలా మానసిక ధైర్యం కావాలి. ఒకవేళ పిల్లల దగ్గరకు వెళ్లినా ఈ ఆధునిక కాలంలో కొడుకు, కోడలు ఉద్యోగాల్లో ఉండటం వల్ల, వాళ్ల కుటుంబ వ్యవహారాల బాధ్యతలు నీ నెత్తి మీద రుద్దబడుతాయి.

వయసు మీరిన నీకు వంట వార్పు చేయడం చాలా కష్టం. తప్పని పరిస్థితుల్లో తెలియకుండానే కుటుంబ బరువులు మరింత పెరుగుతాయి.

ఒంటరిగా ఉంటే.... ఆర్థిక భరోసా ఎంత ఉన్నా బ్యాంకుకు వెళ్లి డబ్బు తీసుకోవడం కూడా చాలా కష్టం అవుతుంది.

డబ్బు చాలా చెడ్డది. మంచి వారిని కూడా మాయల మరాఠీలుగా చేస్తుంది.

ఇక అసలు విషయంలోకి వస్తే పిల్లలందరి పేరున రాసిన వీలునామా చెల్లదు.

ఎందుకంటే నా ఆఖరి వీలునామా నీ పేరు మీద ఉంది. ఏదో వాళ్ళని సంతృప్తి పరచడానికి అలా రాశాను కానీ నాకు వాళ్ల మీద నమ్మకం లేదు.

కాలం అలా ఉంది మరి. ఎంతో మంది స్నేహితుల జీవితాలు చూసాను.

చనిపోయి రోజులు కూడా గడవక ముందే బ్యాంకుల చుట్టూ తిరిగే స్నేహితుల భార్యలను చూసి మనసంతా కకావికలమై పోయేది.

నా ఆఖరి వీలునామా ప్రకారం ఆస్తంతా నీ పేరు మీద ఉంది. వీలునామా కాగితం సీల్డ్ కవర్లో ఉంచి బ్యాంకు లాకర్‌లో ఉంచాను. ఏదైనా అవసరమైతే నా ప్రియ శిష్యుడు ఏపీ భవన్ సుబ్రహ్మణ్యంకు ఫోన్ చెయ్. వాడికి చాలా వివరాలు చెప్పాను.

ఆర్థిక స్వాతంత్ర్యం గనక స్త్రీకి ఉంటే ప్రపంచం లోకువగా చూడదు.

పిల్లలు మంచి మంచి ఉద్యోగాల్లో ఉన్నా... ఏదైనా పరిస్థితులు బాగా లేనప్పుడు నువ్వు ఎవ్వరిని అడగక్కర్లేదు.

బ్యాంకు బాలన్స్ అంతా జాయింట్ అకౌంట్‌లోనే ఉంది. ఒక్కసారి నువ్వు బ్యాంకుకు వెళితే నా శిష్యుడు రామారావు బ్యాంకు మేనేజర్‌గా మన ఊరికి బదిలీ అయి వచ్చాడు. వాడు సహాయం చేస్తాడు.

ఏ పిల్లల ఇంటికెళ్ళినా నీకు స్వతంత్రం ఉండదని నాకు తెలుసు. సున్నితమైన నీ మనసు బాధపడుతుంది.

నేను కట్టిన ఇంట్లో, నేను సంపాదించిన సొమ్ముతో నీ శేష జీవితాన్ని చక్కగా గడుపు. దేవుడిచ్చిన జీవితానికి నా చివరి శ్వాస వరకు తోడుగా నిలిచిన నీకు ఆ దేవుడు తోడుగా ఉంటాడు.

వీలునామా మార్చానని పిల్లలకు కోపం రావచ్చు. ఇన్నాళ్ళూ నీతోటి చాకిరీ చేయించుకుని నిన్ను దిక్కులేని దానిగా, జీతం లేని పనిమనిషి లాగా చేసే అవకాశం ఉంటుందని నేను ఇలా చేస్తున్నాను.

మన పిల్లలను కంటికి రెప్పలా పెంచాము. మంచి మంచి చదువులు చెప్పించాం. ఉద్యోగాల్లో స్థిరపడ్డారు.

పెళ్లిళ్ల తర్వాత వాళ్లకున్న బాధ్యతల వల్లో, మరే కారణమో తెలియదు కానీ వాళ్ల ప్రాధాన్యతా అంశాల్లో మనం లేము.

నేనది గుర్తించాను.

మన కొడుకు మనల్ని బాగా చూసుకోవాలని అనుకున్నా కోడలి ఒత్తిడి వల్ల వాడు మనల్ని వాళ్ళతో ఉండమని మాట మాత్రం కూడా అడగలేకపోతున్నాడు.

కూతురి పరిస్థితి సరే సరి.

వాళ్ళ పిల్లల పెంపకానికి, అవసరమైనప్పుడల్లా వాళ్ళ పని మనిషిగా నిన్ను ఉపయోగించుకొని, ఈ అవసాన దశలో నీ వైపు కన్నెత్తి చూడటం లేదు.

ఇవన్నీ నేను గమనించాను.

ఎంతోమంది తల్లిదండ్రులు అనాథ శరణాలయాల్లో దిక్కు మొక్కు లేకుండా జీవనం గడుపుతున్నారు.

తమ సొంత కొడుకులు, కూతుళ్ల ఇళ్లల్లో జీతం లేని వంట మనుషుల్లాగా బతుకు వెళ్ళదీస్తున్నారు.

కాలం పెట్టే పరీక్షకి మనం ఎదురొడ్డి నిలవాలి.

అధైర్య పడకూడదు.

ఒకరు ముందు ఒకరు వెనక. అంతే!

ఓపిక ఉన్నన్నాళ్ళు ధైర్యంగా, ఇష్టమైన పనులు చేస్తూ బతుకు. ఇన్నాళ్లూ ఎన్నో బాధ్యతలు మోసిన నేను ఒక్కసారిగా నిన్ను వదిలి వెళ్ళిపోతే...

మీద పడే బాధ్యతలు నిన్ను ఉక్కిరిబిక్కిరి చేస్తాయని తెలుసు.

దీనికి భయపడకు.

అన్నీ సర్దుకుంటాయి.

కాలమే అన్నింటికీ పరిష్కారం చూపుతుంది.

భాగస్వామికి ఏ లోటు లేకుండా చేయడమే మనలాంటి పెద్దలు చేయవలసిన పని.

జీవితం ఎప్పుడూ సవాళ్లను విసురుతూనే ఉంటుంది. కష్టమైనా, సుఖమైనా నింపాదిగా ఎదుర్కో.

బాధ్యతలన్నీ ఒంటిచేతి మీద నెట్టుకుంటూ వచ్చి బిడ్డలని ప్రయోజకులను చేసిన నువ్వు, ఇప్పుడు వచ్చిన ఈ కష్టాన్ని అధిగమిస్తూ, ఆనందంగా కాలం గడపడమే నీ చేతుల్లో ఉన్న విషయం.

నేను బతికున్న రోజుల్లో ప్రతి సమస్యకి నీతో చర్చించి సలహా తీసుకునే వాడిని.

ఇప్పుడు నువ్వు సలహా అడగడానికి నేను లేను.

కాబట్టి ముఖ్యమైన విషయాలన్నీ చెప్పేశాను.

సమయానుకూలంగా నిర్ణయం తీసుకోవడమే నీ బాధ్యత.

ఇక నీ కాలక్షేపానికి చుట్టుపక్కల పిల్లలందరినీ పిలిచి ఉచితంగా చదువు చెప్పు. అవసరమైతే పేద పిల్లలకి స్కూల్ ఫీజులు కట్టు.

నీకు మానసిక సంతృప్తి కలిగే ఏ పనైనా సరే స్వచ్ఛందంగా చేయగలిగిన ఆర్థిక స్వాతంత్రం నీకు కలిగించాను.

- ఇట్లు...

ప్రేమతో

నీ భర్త "శంకరరావు"

ఎప్పుడో విధి కలిపిన బంధం, చనిపోయిన తర్వాత కూడా తన వంతు బాధ్యతని ఉత్తరం ద్వారా చెప్పిన భర్తకి మనసులోనే ధన్యవాదాలు చెప్పుకుంటూ....

కళ్ళల్లో నీళ్ల సుడులు తిరుగుతుంటే కొంగుతో తుడుచుకుంటూ....

ఎదురుగా గోడపై ఉన్న భర్త ఫోటోకు హృదయపూర్వకంగా నమస్కరించింది శంకర్రావు భార్య పార్వతమ్మ..

# తలపుల అలలు

**- ఎస్.ఎమ్. మలిక్**

ఏదో మరపు లోతుల్లో
చీకటి తెరలు తెరలుగా
కమ్ముకుంటూ ఉంటే
నీ తలపులలో
తడిసి ముద్దవుతున్న నాకు
నీ గురుతుల మిణుగురులు
వెల్తురు ఇంకా దాటిపోలేదని
గుర్తు చేస్తూ ఉంటాయి
అప్పుడప్పుడు కయితలయి
కాయితాలపైన కానవస్తూ ఉంటాయి
కొత్త గొంతుకలేవో ఊపిరి నాదంతో కలిసి
తీతీయని పాటలు అందుకుంటూ ఉంటాయి

ఎదలో జాజి తీగలా, తీగ మల్లెలా
తలపుల అలలు రాగాలల్లుతుంటాయి
చుట్టుముట్టి గట్టిగా పట్టుకుంటాయి
నోరు చెవులు కళ్ళు లయ తప్పుతున్నట్లు
భయపెడుతుంటాయి
గుండె ఏమీ తోచక
చప్పుడు చెయ్యక
చేతకానిదిగా
కళ్ళు కూడా మూసుకుని
ఏవో ఎరుగని లోయల్లోకి
దిగిపోతూ ఉంటుంది!

నీవు కానవస్తావేమోనని
నీవు అలరిస్తావేమోనని
ఎదురు చూసి ఎదురు చూసి
అలసి సొలసి కునుకుపాటుకు
చేజిక్కక పరిగిడే సన్నాహాలు
చేస్తూ ఉంటుంది!!

ఏవేవో మరపు లోతుల్లో నేను
తడిసి ముద్దవుతూ నీ తలపులలో
మునిగి తేలుతూ ఉంటాను!!!

అపార కృపాశీలుడు పరమ కరుణామయుడు అల్లాహ్ పేరుతో

**తఫ్‌హీముల్ ఖుర్‌ఆన్: మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది** **ఖుర్‌ఆన్ అవగాహనం: ఎస్.ఎమ్. మలిక్**

**89 ఆయత్‌లు**

# 43. అజ్ జుఖ్రుఫ్

40-42 ప్రవక్తా, నీవిప్పుడు చెవిటివారికి వినిపిస్తావా? లేదా గుడ్డివారికీ, స్పష్టంగా అపమార్గాన పడి ఉన్న వారికీ సన్మార్గం చూపుతావా? ఇకనయితే మేము వీరికి శిక్ష విధించవలసే ఉంది, నిన్ను ప్రపంచం నుంచి నిష్క్రమింపజేసినా, లేదా వీరికి మేము వాగ్దానం చేసిన అంతిమ పరిణామాన్ని నీకు కళ్ళారా చూపించినా, మాకు వీరిపైన పూర్తి అధీనం ఉంది.[37] నీవుమటుకు ఎట్టి పరిస్థితిలోనూ, వహీ ద్వారా నీ వద్దకు పంపిన గ్రంథాన్ని గట్టిగా పట్టుకో, నిస్సందేహంగా నీవు సన్మార్గానే ఉన్నావు.[38] వాస్తవానికి ఈ గ్రంథం, నీ కొరకు, నీ జాతికొరకు ఒక మహత్తర గౌరవప్రదాయిని, మరేమో అచిరకాలంలోనే దీని విషయంలో మీరు జవాబు చెప్పుకోవలసి ఉంటుంది.[39] నీకు పూర్వం మేము పంపించిన సందేశహరుల నందరినీ అడిగిచూడు, మేమేమన్నా కరుణామయుడయిన దైవం తప్ప మరే ఇతర ఆరాధ్యులను ఆరాధించాలని నియమించామేమో?[40]

37. ఈ మాటలు పలికిన వాతావరణాన్ని దృష్టిలో ఉంచు కుంటే వచనానికి భావం బాగా అర్థమవుతుంది. మక్కా తిరస్కారులు, ముహమ్మద్(స) వ్యక్తిత్వమే తమ కోసం విపత్తుగా తయారయిందని భావించేవారు. ఈ ముల్లు కాస్తా తొలిగిపోతే అన్నీ బాగుపడతాయని అనుకునేవారు. ఈ కలుషిత దురూహ తోనే వారు రేయింబవళ్ళు కూచొని సంప్రతింపులు జరిపే వారు, ఆయన్ని ఏ విధంగానయినా అంతమొందించాలని. దీనికి పరమ ప్రభువు వారిని వదలి తన ప్రవక్తను సంబోధిస్తూ అంటున్నాడు, నీవు ఉన్నా లేకపోయినా పెద్దగా వ్యత్యాసం ఏదీ ఏర్పడదు. నీవు బ్రతికి ఉంటే నీ కళ్ళెదుటే వీరికి శాస్తి జరుగుతుంది. నిన్ను పైకి తీసుకోవడం జరిగితే నీ తరువాత వీరి సంగతేదో చూసుకోవడం జరుగుతుంది. చేసిన చేష్టలకు శాస్తి మటుకు వీరికి పూర్తిగా విధితమయి పోయింది. వీరు దీన్ని ఇక ఏ విధం గానూ తప్పించుకోలేరు.

38. అంటే, అన్యాయంగా, అధర్మంగా సత్యాన్ని వ్యతిరేకించే వారు తమ చేష్టలకు ఎప్పుడు ఏ శిక్షను పొందుతారో అన్న విషయాన్ని గురించి నీవు చింతించనక్కర లేదు. నీ జీవితంలో ఇస్లామ్‌కు ఉన్నతి ప్రాప్తిస్తుందా లేదా అన్న విషయాన్ని గురించి కూడా నీవు చింతించనవసరం లేదు. నీవు సత్యం పైన నిలక డగా ఉన్నావన్న విషయం ఒకటే చాలు నీ తృప్తికి. కనుక పరిణామాల చింతకు లోనవకుండా నీ బాధ్యతను నెరవేరుస్తూ సాగిపో. అంతా అల్లాహ్‌పైన వదలివేయి- ఆయన అసత్యానికి నీ సమక్షంలో తల వంపులు తెస్తాడో లేదా నీ తరువాత అది జరుగుతుందో.

39. అంటే, ఇంతకన్నా ఒక వ్యక్తి సౌభాగ్యం ఏమి కాగలదు, మానవులందరిలోకెల్లా అతన్ని ఎన్నుకుని అల్లాహ్ తన గ్రంథాన్ని అందజేయాలని అనుకోవడం కన్నా మహత్తు ఏముంటుంది. అలాగే ఒక జాతిని గురించి ఇంతకన్నా సౌభాగ్యవంతమయిన విషయం దేన్ని ఊహించగలము? ప్రపంచంలోని సమస్త జాతులను కాదని అల్లాహ్ అందులోనే తన ప్రవక్తను ప్రభవింపజేయడం, దాని భాషలో తన గ్రంథాన్ని అవతరింపజేయడం, దానికి ప్రపంచంలో దైవ సందేశాన్ని అందజేసే జాతిగా వెలిసే అవకాశాన్ని ఇవ్వడం- ఇంతకన్నా గొప్పదనమేముందనీ. ఈ శ్రేష్ఠతను ఖురైష్ ప్రజలు, అరబ్బులు సరిగ్గా గుర్తించలేకపోతే, వారు దీనికి విలువ నివ్వకుండా అశ్రద్ధ చూపదలిస్తే ఒక సమయం రానున్నది, అప్పుడు వీరు దీనికి సమాధానం చెప్పుకోవలసి వస్తుంది.

40. దైవ సందేశహరుల్ని అడగటమంటే, వారు అందజేసిన గ్రంథాల ద్వారా తెలుసుకోవడం అన్నమాట. ఏ విధంగా నయితే దివ్య ఖుర్‌ఆన్‌లోని (మీరు ఏ విషయంలోనయినా వివాదానికి గురయినట్లయితే దైవం, దైవప్రవక్త వైపునకు మరలండి-అన్ నిసా:59) అన్నదానికి భావం, ఏ విషయంలో నయినా వివాదం ఏర్పడితే దాన్ని అల్లాహ్, దైవప్రవక్త వద్దకు తీసుకు వెళ్ళడమన్నది కాక ఆ విషయాన్ని గురించి దైవగ్రంథాన్నీ, ఆయన ప్రవక్త (స) ఆచరణని సంప్రదించాలని అర్థమో అదేవిధంగా, దైవసందేశహరుల్ని అడగాలన్నా భావం ప్రపంచం నుంచి నిష్క్రమించిన ప్రవక్తల్ని అందరినీ వెళ్ళి అడగటం అన్నదీ కాదు. దీని సరయిన భావం, దేవుని ప్రవక్తలు ఏ సరయిన బోధనల్ని ప్రపంచంలో వదలి వెళ్ళారో వాటినన్నింటిలో అన్వేషించి చూసుకోండి, మహా మహిమా న్వితుడయిన ప్రభువు అల్లాహ్ తప్ప మరెవరయినా ఆరాధనకు అర్హుడని ఎవరు నేర్పారో చూడండి అన్నది.

అపార కరుణామయుడు, పరమ కృపాశీలుడు అల్లాహ్ పేరుతో

# సహీహ్ బుఖారీ (5వ సంపుటం)

ఉర్దూ అనువాదం: అల్లామా వహీదుజ్జమాఁ (ర.అలై)
తెలుగు అనువాదం : ముహమ్మద్ అజీజుర్రహ్మాన్

كِتَابُ فَضَائِلِ أَصْحَابِ النَّبِيِّ ﷺ
3. ప్రవక్త ప్రియ సహచరుల (రజిఅల్లాహు అన్హుమ్)
గొప్పదనం

## అధ్యాయం : 81

## దైవప్రవక్త(స) తన సహచరుల మధ్య ఏర్పరచిన సోదర బంధం

**563)** హజ్రత్ అనస్(రజి) కథనం: హజ్రత్ అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్ (రజి) హిజ్రత్ చేసి (మదీనా) వచ్చినప్పుడు, ప్రవక్త మహనీయులు(స) ఆయనకు సాద్ బిన్ రబీ (రజి)తో సోదర బంధం ఏర్పరచారు. ఒకసారి సాద్(రజి) అబ్దుర్రహ్మాన్ (రజి)తో, "నా దగ్గరున్న సిరిసంపదల్లో నుంచి సగభాగం మీరు తీసేసుకోండి" అని ప్రతిపాదించారు. దానికి అబ్దుర్రహ్మాన్, "అల్లాహ్ మీ ఆస్తిపాస్తుల్లో ఆలుబిడ్డల్లో శుభాన్ని ప్రసాదించుగాక! నాకు మార్కెట్ దారి చూపించండి, చాలు"[1] అని చెప్పారు. ఆ విధంగా ఆయన వ్యాపారం చేయసాగారు. మొదటి రోజు ఆయనకు నెయ్యిలో, జున్ను ముక్కల్లో కొంత లాభం వచ్చింది. కొన్ని రోజులు గడిచిన మీదట దైవప్రవక్త(స) అబ్దుర్రహ్మాన్‌ను గమనించారు. ఆయన దుస్తులపై (సువాసనతో కూడిన) కుంకుమ రంగు గుర్తులు కనిపించాయి. "అబ్దుర్రహ్మాన్! ఏమిటిది?" అని అడిగితే, "దైవప్రవక్తా! నేనొక అన్సార్ మహిళను వివాహమాడాను" అన్నారు. "మరైతే మహర్‌గా నీవు ఆమెకు ఏమిచ్చావు?" అని ప్రవక్త(స) ప్రశ్నించగా, "ఒక టెంక బరువుకు సమానంగా బంగారం ఇచ్చానన్నారా"యన. దానికి దైవప్రవక్త(స), "మంచిది. ఇప్పుడు నీవు వలీమా విందు ఇవ్వు; ఒక మేకను జిబహ్ చేసి అయినా సరే" అని సూచించారు.

## అధ్యాయం : 82

**564)** మహనీయ అనస్(రజి) కథనం: ప్రవక్త మహనీయులు(సఅసమ్) మదీనాకు ఏతెంచారన్న సమాచారం అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి)కు తెలిసినప్పుడు, కొన్ని ప్రశ్నలు వేసే ఉద్దేశ్యంతో ఆయన దైవప్రవక్త(స) సన్నిధికి వచ్చారు. ఇలా అన్నారు: 'నేను మీకు మూడు ప్రశ్నలు వేస్తాను. ఒక్క దైవప్రవక్తకు తప్ప వాటి సమాధానం వేరెవరికీ తెలిసి ఉండదు- 1) ప్రళయదినం రాకకు మొదటి సూచన ఏది? 2) స్వర్గవాసులకు అన్నిటికన్నా ముందు ఏ భోజనంతో ఆతిథ్యం ఇవ్వబడుతుంది? 3) శిశువుకు ఒక్కోసారి తండ్రి పోలికలొస్తే, ఒక్కోసారి తల్లి పోలిక లొస్తాయి. అలా ఎందుచేత?'

సమాధానంగా దైవప్రవక్త(స) ఇలా అన్నారు: "దైవదూత జిబ్రీల్ (అలైహిస్సలాం) ఇప్పుడే వచ్చి ఈ విషయం నాకు తెలియజేశారు". ఇది విని, 'ఆయన దైవదూతలలో యూదులకు శత్రువు' అన్నారు అబ్దుల్లాహ్ బిన్ సలామ్. దైవప్రవక్త (స) ఇలా అన్నారు: 1) "ప్రళయ సూచనలలో మొట్టమొదటిది అగ్ని. అది మనుషుల్ని తూర్పు నుండి పడమర వైపునకు తీసుకెళుతుంది. 2) స్వర్గవాసులకు మొట్టమొదట

చేప కాలేయంతో విందు (ఆతిథ్యం) ఇవ్వబడుతుంది. అది చేప కాలేయపు పెద్ద ముక్క అయి ఉంటుంది (ఎంతో రుచికరంగా ఉంటుంది). 3) ఇక శిశువు పోలికల విషయానికి వస్తే స్త్రీ వీర్యంపై పురుషుని వీర్యం ఆధిపత్యం వహించినప్పుడు శిశువుకు తండ్రి పోలికలు వస్తాయి. పురుషుని వీర్యంపై స్త్రీ వీర్యం ఆధిక్యత వహించినప్పుడు శిశువుకు తల్లి పోలికలొస్తాయి."

అంతే. ఈ సమాధానం విని అబ్దుల్లాహ్ బిన్ సలామ్, 'అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్యదైవం లేదని నేను సాక్ష్యమిస్తున్నాను. తమరు దైవ సందేశహరులని కూడా నేను సాక్ష్యం పలుకుతున్నాను' అన్నారు. తరువాత ఆయన ఇలా అన్నారు: 'దైవప్రవక్తా! అపనిందలు మోపటంలో యూదులు సిద్ధహస్తులు. అందుకే, నేను ఇస్లామ్ స్వీకరించిన సంగతి వారికి తెలియజేయక ముందు, నా గురించి వారిని అడగండి'.

కొంతమంది యూదులు రాగానే, "మీ జాతి వారిలో అబ్దుల్లాహ్ బిన్ సలామ్ ఎవరు? ఎటువంటివారు?" అని ప్రశ్నించారు దైవప్రవక్త(స). దానికి యూదులు, 'ఆయన మా అందరిలోకీ ఉత్తముడు. అందరికన్నా ఉత్తముడైన వాని కుమారుడు. మాలో అందరికన్నా శ్రేష్ఠుడు. అందరికన్నా శ్రేష్ఠుని పుత్రుడు' అని సమాధానమిచ్చారు. అప్పుడు దైవప్రవక్త(స), "ఒకవేళ ఆయన ఇస్లామ్ స్వీకరిస్తే అప్పుడు మీరేమంటారు?" అని అడగ్గా, 'ఈ చేష్ట నుండి దేవుడాయన్ని రక్షించుగాక!' అని బదులిచ్చారు. దైవప్రవక్త(స) రెండవసారి కూడా వారికి అదే ప్రశ్న అడగ్గా, వారు తిరిగి అదే జవాబు ఇచ్చారు. ఆ తరువాత అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి) బయటికి వచ్చి, 'అల్లాహ్ తప్ప మరో నిజ ఆరాధ్యదైవం లేదని నేను సాక్ష్యమిస్తున్నాను. ముహమ్మద్(స) దైవప్రవక్త అని నేను సాక్ష్యమిస్తున్నాను' అన్నారు. ఈ సాక్ష్య వచనం విన్న తక్షణమే యూదులు, 'ఇతను మా అందరిలోకీ అల్పుడు. అందరికన్నా అల్పుడైన వాని కుమారుడు' అంటూ ఆయన గురించి చెడుగా మాట్లాడటం మొదలెట్టారు. అది విని అబ్దుల్లాహ్ బిన్ సలామ్, 'దైవప్రవక్తా! విన్నారా! ఇలా అంటారని నేను ముందే ఊహించాన'న్నారు.[1]

**568)** హజ్రత్ ఇబ్నె అబ్బాస్(రజి) వివరించారు: ప్రవక్త మహనీయులు (సఅసమ్) మదీనాకు ఏతెంచి నప్పుడు, యూదులు ఆషూరా దినాన ఉపవాసం పాటించడాన్ని గమనించారు. దాని గురించి వారిని అడిగితే, 'ఇది అల్లాహ్ మూసా (అ)కు, బనీ ఇస్రాయీల్‌కు ఫిరౌన్‌పై విజయాన్ని ప్రసాదించిన రోజు. అందువల్ల మేము ఈ రోజును గౌరవిస్తూ ఉపవాసం పాటిస్తాము' అని వారన్నారు. దానికి దైవప్రవక్త(స), "మేము మూసా (అలైహిస్సలాం)కు మీకన్నా సన్నిహితులం" అని చెప్పారు. ఆ రోజు ఉపవాసం పాటించమని (మాకు) ఆదేశించారు.

563-1. ఒకవైపున అన్సార్లలోని త్యాగగుణం, మరో వైపున ముహాజిర్లలోని స్వాభిమానం ఈ హదీసు ద్వారా కొట్టొచ్చినట్లే కనిపిస్తున్నాయి. ఇచ్చేవారికి, పుచ్చుకునేవారికి కూడా ఇది ఉదాహరణ ప్రాయం. ఈ హదీసు ద్వారా వర్తకానికి ఇవ్వబడిన ప్రాధాన్యం, ప్రోత్సాహం కూడా స్పష్టమవుతోంది.

564-1. ఈ విధంగా యూదుల రెండు నాల్కల ధోరణి బట్ట బయలైపోయింది. మొదట అబ్దుల్లాహ్ బిన్ సలామ్(రజి)ను వారు పొగడ్తల్లో ముంచెత్తారు. ఆయన ఇస్లామ్ స్వీకరించినట్టు తెలియగానే తూర్పారబట్టారు. తమ అడుగులకు మడుగు లొత్తినంత సేపు వారు మెచ్చుకుంటారు. వ్యతిరేకంగా ఉంటే మాత్రం, ఎంత గొప్ప విద్వాంసుడైనా సరే అతన్ని తూల నాడుతారు. ఈ ద్వంద్వ స్వభావం వారిలో ఇప్పుడూ ఉంది.

# విలువల కోసం ప్రాణాలర్పించిన త్యాగధనులు

**- కవి కరీముల్లా**

"**ఐరోపా**లో సంభవించిన సాంస్కృతిక పునరుజ్జీవనం మొత్తం ప్రపంచాన్ని నూతన ఆలోచనల వైపుకు మళ్లించింది. రూసో ప్రతిపాదించిన ప్రజా సార్వభౌమాధికార సిద్ధాంతం ప్రపంచం నలుమూలలకూ పాకింది. స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అంశాలుగా ఫ్రెంచ్ విప్లవం విజయవంతమయ్యింది.'' ఇదీ మనకు తరతరాలుగా యూరప్ చెప్తున్న చరిత్ర. మనమూ గుడ్డిగా నమ్ముతున్న చరిత్ర. ఆసియా, ఆఫ్రికా ఖండాల మహోన్నత చరిత్రను కాలరాసి తమది మహోన్నత చరిత్రగా, నాగరికతగా నిలబెట్టుకునే దుర్నీతి. కాని ఆసియా ఖండంలో 1400 సంవత్సరాల క్రితమే అద్భుత పాలనా వ్యవస్థగా ప్రాతినిధ్య వ్యవస్థను ఇస్లాం అమలు చేసి చూపించింది. ఈ ప్రాతినిధ్య వ్యవస్థను మానవ హక్కులను కాపాడడానికి జరిగిన మహత్తరమైన ముహర్రం సంఘటనకు చరిత్రలో సరియైన స్థానం లేకుండా చేశారు యూరప్ మేధావులు. నిజం నిప్పులాంటిది. నివురు కమ్మినా చీల్చుకుని ప్రకాశిస్తూనే ఉంటుంది.

అరబీ క్యాలండర్‌లో 'ముహర్రం' మొదటి నెల. దాదాపు 1400 సంవత్సరాల క్రితం ప్రాతినిధ్య పాలనా వ్యవస్థకు, విలువలకు భిన్నంగా తండ్రి తరువాత వారసుడిగా కొడుకును రాజుగా చేసే ప్రయత్నం జరిగింది. నాటి ధర్మవేత్తలు ఈ ప్రయత్నాలను వ్యతిరేకించారు. అధికారం అనువంశికం ఎంతమాత్రం కాదని, నియంతృత్వానికి చోటే లేదని చాటి చెప్పారు. దీనిని యజీద్ సహించలేకపోయాడు. మహాప్రవక్త ముహమ్మద్(స) మనుమడైన హజ్రత్ ఇమామ్ హుసైన్ (రజిఅన్) దీన్ని వ్యతిరేకించారు.

హజ్రత్ ఇమామ్ హుసైన్(రజిఅన్) గారి స్వస్థలం మదీనా. ప్రవక్త ముహమ్మద్(స)వారి కుమార్తె బీబి ఫాతిమా (రజిఅల్లాహు అన్హా), అల్లుడు హజ్రత్ అలీ (రజిఅన్)గార్ల కుమారుడు. హిజ్రీ శకం 4 షాబాన్ నెల 3వ తారీఖున జన్మించారు. వీరి 57వ సంవత్సరంలో ఈ ఘటనలు చోటుచేసుకున్నాయి. యజీద్ రాజరికాన్ని వ్యతిరేకించిన ప్రజలు తమకు దిశానిర్దేశనం చేయమని ఇమామ్ హుసైన్(రజి) గారికి వర్తమానం పంపారు. ఇది ఇస్లాం ప్రతిపాదించిన ప్రాతినిధ్య విలువలకు విరుద్ధంగా రాజరిక వ్యవస్థకు అంకురార్పణ చేసే తిరోగమనంగా భావించి ఆయన ప్రజా చైతన్యానికి పిలుపిచ్చారు. ఇరాక్ ప్రజల కోరిక మేరకు ఇమామ్ హుసైన్ (రజిఅన్) గారు తన కుటుంబ, అనుచర సమేతంగా 72 మందితో ఇరాక్ బయలుదేర్తారు. ఇమామ్ ఇరాక్ చేరితే ప్రజల పోరాటానికి నాయకత్వం వహిస్తారని భావించి ఆయనను దిగ్బంధించేందుకు యజీద్ సైన్యాన్ని పంపించాడు. ఇరాక్‌లోని కర్బలా అనే మైదానంలోకి ఇమామ్ హుసైన్(రజి) తన పరివారంతో అడుగుపెట్టగానే యజీద్ సైన్యం మైదానాన్ని చుట్టుముట్టింది. తన రాజరికాన్ని ఆమోదిస్తే సర్వసౌఖ్యాలు అనుభవించవచ్చని యజీద్ కబురంపిస్తాడు. కాని ఇమామ్ ఇస్లామీయ విలువల విషయంలో రాజీపడలేదు. వారందరికీ అన్నపానీయాలందకుండా దిగ్బంధించడం జరిగింది. వెంట తెచ్చుకున్న ఆహారం, నీరు అయిపోతే ఇమామ్ లొంగుతారని, ఇమామ్ లొంగిపోయారని చూపి ప్రజలను లొంగదీయవచ్చని యజీద్ భావించాడు. ఒక వైపు ఆకలిదప్పులతో విలవిలలాడు తున్న తన కుటుంబం, మరోవైపు చుట్టుముట్టిన 4 వేల సైన్యం. కానీ హజ్రత్ ఇమామ్ హుసైన్ (రజి) సంకల్ప బలం ముందు ఈ యాతనలన్నీ గడ్డిపోచలే. తను తన కుటుంబం ఏ మాత్రం లొంగినా ప్రవక్త ముహమ్మద్(స) మనుమడు ఇమామె హుసైన్(రజి) రాజరిక, అనువంశిక విధానాలను ఆమోదించారని ప్రచారం చేసి ఇస్లామీయ ప్రాతినిధ్య విలువలను మట్టుబెడ్తారని భావించిన ఇమామ్ పోరాటానికే సిద్ధపడ్డారు. ఈ సందర్భంలో ఇమామ్ పరివారంలోని స్త్రీలు, పిల్లలు, పరివారం చూపిన తెగువ, ధైర్యం యజీద్ సైన్యాన్ని నివ్వెరపరిచింది.

అది ముహర్రం నెల 10వ తేది. సరికొత్త త్యాగాల చరిత్రను లిఖించిన కర్బలా మైదానంలో వీరోచితంగా పోరాడుతూ ఇమామ్ పరివారంలోని ఒక్కొక్కరూ నేలకొరిగారు. మహా వీరుడైన హజ్రత్ ఇమామ్ హుసైన్ (రజి) ముందు యజీద్ సైన్యం నిలబడలేక పోయింది. ఇంతలో నమాజ్ సమయమైంది. తను నమాజ్ చేసుకునే వరకూ ఆగమని సైగ చేసి యుద్ధ మైదానంలో నమాజ్ చేస్తూ దైవం ముందు మోకరిల్లారు ఇమామ్. నమాజ్ పూర్తయి తిరిగి కత్తి చేతబడితే ఇమామ్‌ను నిలువరించటం అసాధ్యమని తలచిన యజీద్ మూక యుద్ధనీతిని ఉల్లంఘించి సజ్దాలో దైవం ముందు మోకరించి ఉంచిన ఇమామ్ శిరస్సును ఖండించారు. కాలం విలవిలలాడింది. ప్రకృతి రోదించింది. ప్రజాగ్రహం పెల్లుబికి రాజరిక వ్యవస్థను పెళ్లగించటం తదనంతర చరిత్ర. కానీ మానవాళి చరిత్రలోనే అమరత్వపు సువాసనలు పూయించిన గొప్ప అమర చరిత్ర ఇది. తమ కోసమో, తమ కుటుంబాల కోసమో, ఐహిక అధికార సౌఖ్యాల కోసమో కాక ప్రజల కోసం, ప్రజల హక్కుల కోసం, ఇస్లామీయ ప్రాతినిధ్య విలువల కోసం జరిగిన ఈ కర్బలా యుద్ధం అందించిన ప్రేరణ సదా మానవ ఇతిహాసపు చైతన్య దీపమై వెలుగుతూనే ఉంటుంది. చరిత్రెప్పుడూ అంతే. చీకట్లోనే ఉండదు.



# ఖుర్‌ఆన్‌లో మొక్కలు, ఫలాల ప్రస్తావన
## ఆరోగ్యానికి ఆలంబన

అర్షియా, విజయవాడ

**మానవాళి** మనుగడకు చెట్లు ఎంతో కీలకం. ఆహారం.. వైద్యం.. నివాసం.. వస్త్రాలు.. అన్నింటికీ వృక్షాలే మూలం, సమస్త వృక్షజాతినీ ఆ సృష్టికర్త అయిన అల్లాహ్‌యే సృష్టించాడు. కానీ ఖుర్‌ఆన్‌లో ప్రస్తావనకు వచ్చిన పండ్లు, మొక్కలు, వృక్షాలకు ఎంతో విశిష్టత ఉంది. దుబాయ్‌లో అయితే ఏకంగా ఖురాన్ పార్కును ఏర్పాటు చేశారు. ఖుర్‌ఆన్‌లో పేర్కొనబడిన మొక్కలు, వృక్షాలు, పండ్లు, ఫలాలతో ఈ పార్కును ఏర్పాటు చేశారు.

ఈ సృష్టికి యజమాని అల్లాహ్‌యే. ఈ సృష్టిలోని ప్రకృతి వనరులను మనిషికి అప్పగింతగా అప్పచెప్పాడు. ఇష్టానుసారం వాడుకోవ డానికి వీల్లేదు. వనరుల్ని జాగ్రత్తగా వినియోగించుకోవాలి. జవాబు దారీ తనంతో మసలుకోవాలి. త్రాగే నీరు, వాడుకునే వస్తువులు, వినిమయ వస్తువులన్ని కొన్ని పరిమితులకు లోబడి వినియోగించు కోవాలన్నది ఖుర్‌ఆన్ హెచ్చరిక. వృక్ష జాతుల విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. చెట్లను, ప్రకృతి పచ్చదనాన్ని జాగ్రత్తగా కాపాడు కోవాలి. దైవగ్రంథంలో ప్రస్తావించిన మొక్కలు, వృక్షాలు, పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలుచేస్తాయి. ఎన్నో రోగాలకు, వ్యాధులకు దివ్య ఔషధంగా పనిచేస్తాయి. ఖుర్‌ఆన్‌లో విశదపరచిన పండ్లు, ఫలాలు, వృక్షాలు వాటి విశిష్టతల్ని తెలుసుకుందాం..

ఆకాశం నుండి మీ కోసం నీళ్ళను కురిపించేవాడు ఆయనే. ఆ నీటిని మీరూ తనివితీరా త్రాగుతారు, ఆ నీటివల్ల మీ పశువులకు కూడా మేత మొలుస్తుంది. ఆయన ఆ నీటిద్వారా పొలాలను పండిస్తాడు. జైతూను, ఖర్జూరం, ద్రాక్ష ఇంకా రకరకాల ఇతర పండ్లను పండిస్తాడు. ఆలోచించే వారికి ఇందులో ఒక గొప్ప నిదర్శనం ఉంది. (16:11)

### రేగు పండ్లు

వారి పూర్వపు రెండు తోటల స్థానంలో మరో రెండు తోటలను వారికి ఇచ్చాము. వాటిలో చేదుపండ్లు, ఝూవుక వృక్షాలు ఉండేవి, కొన్ని రేగిచెట్లు కూడా ఉండేవి. (34:15-16)

చలికాలంలో దొరికే రేగుపండ్లను తినడం వలన చాలా ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. ఇక శరీరానికి చక్కటి పోషకాలు అందించడంలో రేగుపండ్లు బాగా ఉపయోగపడతాయి. ఈ మినరల్స్ గుండె ఆరోగ్యంగా ఉండటానికి చాలా అవసరం. అంతేకాక రక్తంలో హిమోగ్లోబిన్ పెరగాలంటే ఐరన్ అవసరం ఎంతయినా ఉంది. రేగు పండ్ల వలన రక్తహీనత సమస్య తగ్గుతుంది. రక్త ప్రసరణ సాఫీగా జరగాలన్న కూడా రేగు పండ్లు శరీరానికి చాలా అవసరం. ఇక ఎండిన రేగు పండ్లలో కాల్షియం,

ఫాస్ఫరస్ పుష్కలంగా లభిస్తాయి. ఇవి ఎముకలు దృఢంగా వుండేందుకు చాలా అవసరం. అంతేకాక ఆర్థరైటిస్ సమస్యతో బాధ పడేవారు ఈ పండ్లు తినడం వలన మంచి ప్రయోజనం ఉంటుంది. కీళ్లకి సంబంధించిన సమస్యలు ఉన్నవారు ఈ పండ్లు తింటే చాలా మంచిది. రేగిపండ్లు ఒత్తిడి తగ్గించడంలో కూడా బాగా పనిచేస్తాయి. దీనిలో ఒత్తిడిని తగ్గించే గుణాలు ఎక్కువ. ఇవి చర్మ ఆరోగ్యాన్ని పెంచి యవ్వనంగా ఉంచుతాయి. చర్మం ముడతలు పడడం తగ్గుతుంది. మలబద్ధకం ఉన్నవారికి రేగిపండు చాలా మంచిది.

### ద్రాక్ష

నీటి ద్వారా మేము మీ కొరకు ఖర్జూరపు తోటలనూ, ద్రాక్ష తోటలనూ సృష్టించాము. ఈ తోటలలో మీ కొరకు అత్యంత రుచికరమైన పండ్లు ఉన్నాయి (23:19)

ద్రాక్ష పండ్లంటే నచ్చని వారుండరు. ద్రాక్ష పండ్లలో పలు రకాలున్నాయి.. నలుపు, ఎరుపు, పచ్చ వంటి రంగుల్లో లభిస్తాయి. ద్రాక్ష పండ్లు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి.

ఫ్రక్టోజ్ వంటి సహజ చక్కెరలకు ద్రాక్ష ఉత్తమ వనరులలో ఒకటి. ద్రాక్షలో 20% కంటే ఎక్కువ కంటెంట్ చక్కెర, ఇది రక్తహీనత ఉన్నవారిలో శక్తిని పెంచడానికి మంచిది. ద్రాక్షలో ఉండే చక్కెర, ఇనుము కూడా మూత్రపిండాలు, కాలేయాలను ఉత్తేజపరిచేందుకు సహాయపడతాయి, ఇది శరీరం నుండి విష వ్యర్థాలను వదిలించుకోవడానికి సహాయ పడుతుంది. ద్రాక్ష పండ్లలోని విటమిన్స్, మినరల్స్ వంటి ఖనిజాలు శరీరంలోని చెడు వ్యర్థాలను తొలగిస్తాయి. ద్రాక్ష పండ్లను ప్రతిరోజూ సలాడ్ రూపంలో ఆరోగ్యానికి మంచిదంటున్నారు నిపుణులు.

### ఖర్జూరాలు..

ఆయన భూమిని సకల సృష్టిరాసులకై సృజించాడు. అందులో అన్ని రకాల రుచికరమైన పండ్లు పుష్కలంగా ఉన్నాయి, ఖర్జూరపు వృక్షాలు ఉన్నాయి. వాటి పండ్లు పొరలలో చుట్టబడి ఉన్నాయి. (55:11)

రోజూ ఓ ఖర్జూరం తీసుకుంటే గుండె జబ్బులు రావు. ఇందులో కొలెస్ట్రాల్, యాంటీ ఆక్సిడెంట్స్, ఫినాలిక్ యాసిడ్ చాలా తక్కువ. కెరోటినాయిడ్స్, ఫ్లేవనాయిడ్స్ ఎక్కువగా ఉండడం వల్ల ఇది ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గించి, హృదయ నాళ వాపుని తగ్గిస్తుంది.

### ఆలివ్..

ఇంకా మేము తూరు సీనా ప్రాంతంలో పుట్టే చెట్టును కూడ సృష్టించాము, అది నూనెను కూడ ఇస్తుంది. ఇంకా తినేవారికి కూరగా కూడ ఉపయోగపడుతుంది. (23:20)

ఆలివ్ ఆయిల్‌ని వాడితే జీర్ణ సమస్యలు దూరమవుతాయి. ఇందులోని మోనోశాచురేటెడ్ కొవ్వులు జీర్ణ సమస్యల్ని దూరం చేసి ప్రేగు కదలికల్ని ప్రోత్సహిస్తుంది. దీనిని తీసుకోవడం వల్ల పేగు వ్యాధులు, పూతల వంటి సమస్యలు దూరమవుతాయి. ఆలివ్ నూనెని వాడడం వల్ల బ్రెయిన్ హెల్త్‌గా మారి మతిమరుపు వంటి సమస్యలు దూరమవుతాయి. ఆలివ్ ఆయిల్‌లోని యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ ఆక్సిడెంట్ గుణాల వల్ల ఇలా జరుగుతుందని చెబుతున్నారు. రక్తపోటుని తగ్గించడంలోనూ ఆలివ్ ఆయిల్ ముందుంటుంది. ఆలివ్ ఆయిల్‌లోని మోనోశాచురేటెడ్ ఫ్యాట్స్ ధమనుల పనితీరుని మెరుగ్గా చేసి రక్తనాళాల్లో మంటని తగ్గించి రక్తపోటుని తగ్గిస్తాయి. క్యాన్సర్స్‌ని దూరం చేయడంలో ఆలివ్ ఆయిల్‌ని యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ముందుంటాయి. రొమ్ము, పెద్దప్రేగు, ప్రొస్టేట్ క్యాన్సర్ సహా క్యాన్సర్స్‌తో ఆలివ్ ఆయిల్ పోరాడతాయి.

### దానిమ్మ

అల్లాహ్‌యే నిటారు చెట్లుగల పలురకాల తోటలనూ, ద్రాక్ష తోటలనూ, ఖర్జూరపు తోటలనూ సృష్టించాడు. పొలాలను పండించాడు. వాటిద్వారా రకరకాల ఆహార పదార్థాలు లభిస్తాయి. జైతూను చెట్లనూ దానిమ్మ చెట్లనూ ఉద్భవింపజేశాడు. వాటి పండ్లు రూపంలో ఒకటే. కాని వాటి రుచి వేరు. (6:141)

దానిమ్మపండులో పొటాషియం అధికంగా ఉంటుంది, ఇది శరీరంలో ద్రవ సమతుల్యతతో పాటు కండరాల సంకోచాలు, నరాల సంకేతాలకు సహాయపడుతుంది. వాటిలో ఇనుము, కాల్షియం, భాస్వరం మంచి మొత్తంలో ఉంటాయి, ఇవి రక్తం, ఎముకలు, దంతాలకు మంచివి. తాజా దానిమ్మలో ఫైబర్

పత్రిక కాదిది, ఆత్మవేదన
క్రియాత్మక చేతన
సహజీవన భావనల పావురాయి
గీటురాయి
వారపత్రిక

పుష్కలంగా ఉంటుంది, ఇది బరువు తగ్గడం, కొలెస్ట్రాల్ తగ్గింపు, మలబద్ధకం నుండి ఉపశమనం కలిగిస్తుంది. దానిమ్మ పోషక విలువలో విటమిన్ సి, విటమిన్ కె వంటి విటమిన్లు ఉన్నాయి, అలాగే ఫ్లేవనాయిడ్స్, పాలీఫెనాల్స్ వంటి యాంటీఆక్సిడెంట్లు మొత్తం ఆరోగ్యం, వ్యాధి నివారణకు దోహదం చేస్తాయి. దానిమ్మలు అందించే పొటాషియం- సోడియం సమతుల్యత కారణంగా, అలసిపోయిన కండరాలు పునరుజ్జీవింపజేయగలవు, సులభంగా కదులుతాయి,

## అరటి..

అరటి పండ్ల గెలలు, దూరంగా వ్యాపించి ఉండే నీడలు, ఎల్లప్పుడూ ప్రవహించే నీరు, ఎన్నటికీ అంతంకాని, నిరాటంకంగా లభించే అసంఖ్యాకమైన పండ్లు, ఎత్తైన ఆసనాలు వీటి మధ్య ఉంటారు. (56:28-33)

రోజువారీ ఆహారంలో అరటిపండును చేర్చుకుంటే మీరు మంచి ఆరోగ్య ఫలితాలను కనుగొంటారు. అరటిపండులో పొటాషియం, మెగ్నీషియం, విటమిన్-ఎ, బి, సి, విటమిన్ బి6 ఉన్నాయి. మీరు అధిక బరువుతో ఉంటే అరటిపండ్లు బరువు తగ్గడానికి, మీ ప్రేగులను ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఇది నాడీ వ్యవస్థను బలపరుస్తుంది.

## అంజీర ఫలం

అత్తి, ఆలివ్‌లు సాక్షిగా! సీనా పర్వతం సాక్షిగా! (95:1)

అత్తి పండ్లలో విటమిన్ ఎ,బి,సి,కెతో పాటు కార్బోహైడ్రేట్లు, ఐరన్, పొటాషియం, మెగ్నీషియం, కాల్షియం మొదలైనవి ఉంటాయి. అంజీర పండ్లలో ఐరన్ పుష్కలంగా ఉంటుంది, ఇది రక్తహీనతను నివారిస్తుంది. శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచుతుంది. అత్తి పండ్లలో జీర్ణక్రియకు సహాయపడే డైటరీ ఫైబర్ ఉంటుంది. ఇది మలబద్ధకం, అసిడిటీని నివారిస్తుంది. అత్తి పండ్లను, వాటి ఆకులలోని సమ్మేళనాలు ఇన్సులిన్ సెన్సిటివిటీని సమతుల్యం చేస్తాయి. భోజనానికి ముందు, ఆ తర్వాత సరైన మోతాదులో అంజీర పండ్లను తినడం వల్ల పైల్స్ వంటి వ్యాధులు నయమవుతాయి.

పురుషులు అత్తి పండ్లను తినడం వల్ల ప్రయోజనం పొందవచ్చు. అత్తిపండ్లలో జింక్, మాంగనీస్, మెగ్నీషియం, ఐరన్ వంటి ఖనిజాలు పుష్కలంగా ఉన్నాయి. అంజీరలో వుండే యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్ హార్మోన్ల అసమతుల్యత, రుతుక్రమ సమస్యల నుండి బైట పడేస్తాయి.

## తేనె

మీ ప్రభువు తేనెటీగకు వహీ ద్వారా ఈ విషయాన్ని తెలిపాడు. కొండలలో, చెట్ల మీద, తడికలపై ఎక్కించబడిన తీగెలలో నీ తెట్టె లను నిర్మించుకో, అన్ని రకాల పండ్లరసాన్ని పీల్చు, నీ ప్రభువు సుగమం చేసిన మార్గాలపై నడుస్తూ ఉండు.'' ఈ ఈగ కడుపులో నుండి రంగురంగుల పానకం ఒకటి వెలువడుతుంది. అందులో ప్రజల కోసం వ్యాధి నివారణ శక్తి ఉన్నది. ఆలోచించే వారికి ఇందులో కూడా నిశ్చయంగా ఒక సూచన ఉంది. (16:69)

రోజుకో చెంచా పరిమాణంలో తేనె తీసుకోవడం వల్ల చాలా లాభాలు ఉన్నాయి. స్వీట్స్ ఎక్కువగా తినడం ఆరోగ్యానికి మంచిది కాదు. దీని వల్ల షుగర్ వంటి సమస్యలు వస్తాయి. అయితే, తేనే నేచురల్ స్వీట్‌నర్.. శరీరానికి శక్తిని ఇవ్వడానికి తేనె చాలా మంచిది. తేనె నేచురల్ హెల్దీ బూస్టర్. ఇందులో ఉండే ఫ్రక్టోజ్, గ్లూకోజ్ త్వరగా రక్తంలోకి ప్రవేశించి శరీరానికి శక్తిని అందిస్తుంది. అందుకే మార్నింగ్ డ్రింక్స్‌లో చక్కెరకి బదులు తేనె కలుపుకోవచ్చు. ఉదయం బ్రెడ్‌లో జామ్ బదులు తేనె తీసుకోవచ్చు. దీనివల్ల అలసట దూరమవుతుంది. వర్కౌట్ తర్వాత ఇది బాడీకి శరీరానికి శక్తిని ఇస్తుంది. తేనెలో పాలీఫోనిక్ యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. దీన్ని రోజూ తీసుకోవడం వల్ల గుండె సమస్యలు రాకుండా ఉంటాయి. రక్త నాళాల్లో చెడు కొలెస్ట్రాల్‌ని తగ్గించి గుండె సమస్యల్ని దూరం చేయడంలో ఇవి బాగా హెల్ప్ చేస్తాయి. ఇక ఉదయాన్నే గోరువెచ్చని నీటిలో నిమ్మరసం, తేనె కలిపి పరగడపున తీసుకుంటే పొత్తికడుపులోని పేరుకుపోయిన చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది. ఇందులోని యాంటీ సెల్యులాయిడ్ గుణాలు బాడీలోని జీవక్రియని పెంచి బరువు తగ్గిస్తాయి. తేనెలోని యాంటీ మైక్రోబయల్ గుణాలు గొంతు, ఊపిరితిత్తుల్లోని బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లని దూరం చేసి సీజనల్ సమస్యల్ని తగ్గిస్తుంది. దగ్గుతో బాధపడేవారు తేనెని తీసుకోవచ్చు.

## కూరగాయలు

భూమిలో ఉత్పత్తి అయ్యే ఆకుకూరలు, కూరగాయలు, గోధుమలు, వెల్లుల్లి, ఉల్లిపాయలు, పప్పు దినుసులు మొదలైనవి మా కొరకు పండించు అని నీవు నీ ప్రభువును ప్రార్థించు. (2:61)




**ఖుర్‌ఆన్ దేవుని వాక్యం.** ఇందులో సందేహం ఉంటే, దానిని పోలిన సూరాను రూపొందించండి అని ఖుర్‌ఆన్ సవాల్ చేసింది. ఖుర్‌ఆన్ అల్లాహ్ చివరి సందేశం. సురక్షితంగా ఇప్పుడు మన చేతుల్లో ఉంది. దైవ రచనకు, మానవ రచనకు తేడా ఏమిటంటే, దైవ రచనలో అనంతమైన జ్ఞానసంపద ఉంటుంది. మానవ రచన జ్ఞానపరిధి పరిమితంగా ఉంటుంది. మానవ జ్ఞానం పరిమిత మైనది, అసంపూర్ణ మైనది. ఎప్పుడూ మారుతూ ఉంటుంది. అనుభవాలు, పరిశోధనలతో మనిషి జ్ఞానపరిధి ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతూ ఉంటుంది. ప్రపంచంలోని ఏ రచయిత అయినా తన పుస్తక రచన పూర్త య్యాక మార్పులు చేర్పులకు ఆస్కారం ఉంటుందని భావిస్తాడు. ప్రతీ రచయిత తన పుస్తక మలి ముద్రణలో మార్పులు చేర్పులు చేసి ముద్రిస్తాడు. అల్లాహ్ జ్ఞానపరిధి అనంతం. ఎలాంటి సవరణలకు ఆస్కారం లేదు. అందుకే ఖుర్‌ఆన్ పాఠ్యాంశాలలో ఎలాంటి వైరుధ్యం లేదు. మరెలాంటి లోపాలూ కానరావు. అందుకే సర్వశక్తివంతుడైన అల్లాహ్ ఖుర్‌ఆన్‌లో ఈ విషయాన్ని గురించి ఇలా అంటున్నాడు, "ఈ ప్రజలు ఖురానును గురించి ఆలోచన చెయ్యరా? ఇది అల్లాహ్ తరఫు నుండి కాక వేరొకరి తరఫునుండి వచ్చి ఉన్నట్లయితే ఇందులో ఎన్నో పరస్పర విరుద్ధాలైన విషయాలు ఉండేవి." (ఖుర్‌ఆన్ 4:82) ఒకవేళ ఖుర్‌ఆన్ మానవ రచన అయినట్లయితే అందులోని అంశాలన్నీ ఒకదానికొకటి విరుద్ధంగా ఉండేవి". ఒక పుస్తకంలో ఒక విషయం గురించి చెప్పిన అంశం అదే పుస్తకంలో మరోచోట దీనికి పూర్తి విరుద్ధంగా ఉంటుంది. కానీ ఖుర్‌ఆన్ ఇలాంటి లోపాలకు అతీతం.

### ఖుర్‌ఆన్ ఛాలెంజ్‌పై కొంతమంది కొన్ని అభ్యంతరాలు చేస్తున్నారు. ఆ అభ్యంతరాలేంటో పరిశీలిద్దాం..

1. ఖుర్‌ఆన్‌లో అల్లాహ్ వద్ద ఒక్కరోజు మన ప్రాపంచిక జీవితంలోని వెయ్యి సంవత్సరాలని, మరోచోట 50వేల సంవత్సరాలకు సరిసమానమని ఖుర్‌ఆన్ పేర్కొంది. "నీ ప్రభువు వద్ద ఒక రోజు అంటే మీ లెక్కలో వెయ్యి సంవత్సరాలకు సమానమవుతుంది." (దివ్యఖుర్‌ఆన్ 22:47) "యాభై వేల సంవత్సరాల ప్రమాణం గల ఒక రోజున దైవదూతలు, ఆత్మ, ఆయన సాన్నిధ్యానికి అధిరోహిస్తారు." (ఖుర్‌ఆన్ 70:4)

**జవాబు:** ఈ రెండు వాక్యాలలో రెండు వేర్వేరు సందర్భాలు ప్రస్తావించబడ్డాయి. మొదటి ఆయత్ సూరహ్ హజ్‌లో అల్లాహ్ ప్రజల మాటలకు స్పందించి వెంటనే శిక్షలు అమలు చేయడు. ఒక్కో జాతికి సంవత్సరాల తరబడి వెసులుబాటు ఇస్తాడు. ప్రవక్త నూహ్ (అలై) జాతి ప్రజలకు వెయ్యేళ్ల వ్యవధి ఇవ్వబడింది. బనీ ఇస్రాయీల్ జాతి వద్దకు రెండువేల ఏళ్ల పాటు ప్రవక్తలను పంపాడు. ఎంతోమంది ప్రవక్తలు వారి సంస్కరణ కోసం ఉద్యమించారు. జాతులు తమను తాము సంస్కరించుకునేందుకు శతాబ్దాల వ్యవధి ఇవ్వబడింది. "వారి చేష్టలకు ఆయన వారిని పట్టుకోదలిస్తే, తొందరగానే శిక్షను పంపి ఉండేవాడు. కాని వారి శిక్ష కోసం ఒక సమయం నిర్ణయించబడి ఉన్నది." (ఖుర్‌ఆన్ 18:58)

మన సౌర వ్యవస్థ కాలమానం ప్రకారం 24గంటలు గడిస్తే ఒక్క రోజు పూర్తవుతుంది. భూమి తన చుట్టు తాను తిరగడానికి ఒక రోజు పడుతుంది. విశ్వంలో ఎన్ని గ్రహాలయితే ఉన్నాయో వాటన్నింటికీ వేర్వేరు గంటలతో ఒక్కరోజు పూర్తవుతుంది. చంద్రుని వేగం భూమి వేగంకంటే చాలా నెమ్మదిగా ఉంటుంది. 24గంటలు గడిస్తే రాత్రి-పగలు పూర్తవుతాయి. చంద్రుడు తనచుట్టూ తాను తిరగడానికి 29.5 రోజులు పడుతుంది. అనగా చంద్రుడిపై ఒక్క రోజు, భూమిపై ఒక నెలకు సమానం. అంటే 798 గంటలు పడుతుంది. అంటే 29.5రోజులు. మెర్క్యురీకి 1408 గంటలకు ఒక్కరోజుగా పరిగణించబడుతుంది. 58.7 రోజులు. శుక్రుడికి 5832 గంటలు గడిస్తే ఒక్కరోజు అవుతుంది. అంటే 243 రోజులు. బృహస్పతి గ్రహానికి ఒక్కరోజు పూర్తవ్వాలంటే 10 గంటలు పడుతుంది. భూమి సూర్యుని చుట్టూ తిరగడానికి 365 రోజులు పడుతుంది. సూర్యుడు తన కక్షను ఒక్కసారి చుట్టేయడానికి 22 మిలియన్ల సంవత్సరాలు పడుతుంది. సూర్యుడికి ఒక ఏడాది కాలం అంటే భూమికి 22 మిలియన్ల సంవత్సరాలతో సమానం. ఈ జీవితంలోని వెయ్యి సంవత్సరాల వ్యవధి అల్లాహ్‌కు ఒక్క రోజు లాంటిది. యాభై వేల సంవత్సరా లకు సరిసమానమైన ఆ రోజును తీర్పు దినం Day of Judgementగా ఖుర్‌ఆన్ మఆరిజ్ సూరాలో పేర్కొంది. ఆ వాక్యం తరువాత వచ్చే వాక్యంలో ప్రళయ దినం ప్రస్తావన వచ్చింది. ఆ రోజున అందరి లెక్క తీసుకోబడుతుంది. ఆ రోజున కొందరి లెక్క త్వరగా ఇంకొందరి లెక్కను ఆలస్యంగా తీసుకుంటాడు. ఆ రోజున మనిషి పరిస్థితి ఎలా ఉంటుందో మనం అంచనా వేయలేము. లెక్క తీసుకోవడంలో ఆలస్యమవడమూ శిక్షలో భాగమే.

### మనిషి ఆయుష్షు కొన్ని రోజులు.. గంటలేనా?

మనిషి చనిపోయినప్పటి నుండి ప్రళయం వరకు ఆత్మలు ఉండే ప్రదేశాన్ని ఆలమె బర్జఖ్ (పితృలోకం) అంటారు. బర్జఖ్

వ్యవధి కూడా వేలాది సంవత్సరాలుంటుంది. చనిపోయే వ్యక్తి మాత్రం కొన్ని రోజులు, కొన్ని గంటలే తాను జీవించినట్లు భావిస్తాడు. "వీరు దానిని చూసిననాడు (ప్రపంచంలో గాని లేక మరణావస్థలో గాని) కేవలం ఒక దినంలో ఉదయంగాని సాయంత్రంగాని ఉన్నట్లు వీరికి అనిపిస్తుంది." (ఖుర్ఆన్ 79:46)

ఖుర్ఆన్ సజ్దా అధ్యాయంలోని 5వ వాక్యంలో కూడా హజ్ అధ్యాయం 47వ వాక్యంలో.. "ఒక్కరోజు వెయ్యి సంవత్సరాలతో సమానం" అని చెప్పబడింది. మానవులు అంతరిక్షంలో చేసే వెయ్యేళ్ల ప్రయాణాన్ని దైవదూతలు ఒక్కరోజులో పూర్తిచేస్తారు. దైవదూతలు అత్యంత వేగంగా విహరిస్తారు. దైవదూతలు వెలుగుతో సృష్టించ బడ్డారు. అందుకే వారు కాంతికన్నా వేగంగా ప్రయాణిస్తారు. అల్లాహ్ వద్ద ఏ పని అయినా రెండు రకాలుగా జరుగుతాయి. కొన్ని పనులు భౌతికంగా జరిగితే మరికొన్ని దైవాజ్ఞ లతో జరుగుతాయి. మానవ పుట్టుక అలాంటిదే. గర్భం దాల్చినప్పటి నుండి శిశువు పుట్టడం భౌతికంగా జరుగుతుంది. కానీ తల్లి కడుపులో ప్రాణమనే ఆత్మను ఊదడం దైవదూత ద్వారా జరుగుతుంది. ఈ వ్యత్యాసాన్ని తెలియ జేయడం కోసం ఈ విధంగా వివరించడం జరిగింది. కొన్ని విషయాలు మానవ ఊహకు, అవగాహనకు అందనివని ఖుర్ఆన్ పేర్కొంటోంది. ఈ విషయాలను ముతషాబిహాత్ అంటారు. దైవదూతల రూపురేఖలు, కదలికలన్నీ అల్లాహ్‌యే ఎరుగును.

## 2. అల్లాహ్ ఈ భూమిని ఆరు రోజుల్లో సృష్టించాడా?

ప్రవక్తా! వారితో ఇలా అను: "భూమిని రెండు రోజులలో సృష్టించిన దేవుణ్ణి మీరు తిరస్కరిస్తారా? ఇతరులను ఆయనకు సమాను లుగా నిలబెడతారా? సకల లోకాల వారికి ప్రభువు ఆయనేకదా! ఆయన (భూమిని ఉనికి లోనికి తీసుకువచ్చిన తరువాత) దానిమీద పర్వతాలను నెలకొలిపాడు అందులో శుభాలను పెట్టాడు అర్థించే వారందరి కోసం దాని లోపల వారి కోరికలకూ, అవసరాలకూ అనుగుణంగా కచ్చితంగా అంచనావేసి ఆహార వస్తువులను సమకూర్చాడు. ఈ పనులన్నీ నాలుగు రోజులలో పూర్తి అయ్యాయి. తరువాత కేవలం పొగగా ఉన్న ఆకాశం వైపునకు ఆయన తన ధ్యానాన్ని మరల్చాడు. ఆయన ఆకాశాన్నీ, భూమినీ ఉద్దేశించి ఇలా అన్నాడు: "ఉనికిలోకి రండి, మీకు ఇష్టమయినా,ఇష్టం కాకపో యినా." అవి రెండూ, "మేము వచ్చేశాము, విధేయులు మాదిరిగా" అని అన్నాయి. అప్పుడు ఆయన రెండు రోజులలో ఏడు ఆకాశాలను నిర్మించాడు, ప్రతి ఆకాశంలోనూ దాని చట్టాన్ని వహీ ద్వారా నిర్దేశిం చాడు. ప్రపంచ ఆకాశాన్ని మేము దీపాలతో అలంకరించాము. దానిని బాగా సురక్షితమైనదిగా చేశాము. ఇదంతా ఒక మహా శక్తిమంతుడైన జ్ఞాని పథకం. (ఖుర్ఆన్ 41:9-12)

## ఈ ఖుర్ఆన్ వాక్యాల్లో సృష్టి నిర్మాణ వ్యవధిలో వైరుధ్యం ఏమైనా ఉందా?

ఈ విశ్వం ఒక పేలుడుతో ఉనికిలోకి వచ్చిందని దీన్ని బిగ్ బ్యాంగ్ అంటారని మనందరికీ తెలుసు. ఈ విషయాన్ని గురించి ఖుర్ఆన్ లోని అంబియా సూరాలో వివరణ ఉంది. ఆరు రోజుల్లో సృష్టించడ మంటే మనమనుకుంటున్నట్లు 24గంటలతో కూడిన ఒక రోజు ఎంత మాత్రమూ కాదు, ఆరు యుగాలు అని అర్థం. ఒక్కో యుగం బిలియన్ సంవత్సరాలతో సమానం. భూమ్యాకాశాలను కలిపి నాలుగు రోజులలో సృష్టించడం జరిగింది. ఇందులో నక్షత్రాలు, గెలాక్సీలు, గ్రహాలు ఇలా అన్నీ ఉన్నాయి. ఈ నాలుగు రోజుల్లో రెండు రోజుల సమయంలో భూగోళం సిద్ధం చేస్తే మిగతా రెండు రోజులు భూమిని తీర్చిదిద్దడానికి దృష్టిపెట్టాడు. మిగిలిన రెండు రోజులు మనం చూస్తున్న ఆహ్లాదకరమైన ధరిత్రిని తీర్చి దిద్దాడు. ఈ రెండు రోజుల వ్యవధిలోనే సప్తాకాశాలను నిర్మించాడు. ఈ ఏడు ఆకాశాల రహస్యం గురించి మనిషికి ఇప్పటి వరకు అంతుచిక్కలేదు. భవిష్యత్తులో సైన్స్ అండ్ టెక్నాలజీ వృద్ధి చెంది ఈ ఏడు ఆకాశాల గురించి పరిశోధనలు జరగవచ్చు. మిగతా గ్రహాలతో పోలిస్తే భూమిపై మనిషికి అనువుగా ఉండే ప్రకృతి వనరుల్ని సృష్టించడానికి చాలా సమయం పట్టింది. పర్వతాలను పాతిపెట్టడం, నీటిని సృష్టించి సముద్రాల రూపంలో విస్తరింప జేయడం. భూమి ఉపరితలంపై మట్టిని ఏర్పాటు చేయడం జరిగింది. చుట్టూ గాలి కవచాన్ని ఏర్పాటు చేయడం, మొక్కలు, జంతువులు, మానవాళికి ఉపయోగపడే జీవరాశులను సృష్టించ డానికి మరో నాలుగు రోజులు పట్టింది. 11వ వాక్యంలో ఈ విశ్వం మొదట్లో పొగలా ఉండేది అన్న విషయం ఉంది. అంటే ఈ విశ్వం మొదట హైడ్రోజన్ వాయువుతో ప్రారంభమైంది. న్యూక్లియర్ ఫ్యూజన్ ద్వారా హీలియం పుట్టింది. క్రమక్రమంగా ఇతర మూలకాలు ఉత్పత్తి చేయబడ్డాయి. ఇందులో ప్రాణ వాయువైన ఆక్సిజన్ కూడా ఒకటి. హైడ్రోజన్, ఆక్సిజన్‌తో కలిపి నీరు ఉత్పత్తి చేయబడింది. సముద్రాలు ఏర్పాటయ్యేంత నీరు కురిపించబడింది. భూమిపై నీటి వనరులతోనే మానవ జీవితం ప్రారంభమైంది.

ఎక్కడైనా ఏదైనా భవన నిర్మాణం చేపట్టాలంటే ముందు అక్కడి నేలలో పునాదులు నిర్మించడానికి త్రవ్వకాలు చేపడతారు. పూతాలు త్రవ్వడానికి 20రోజులు, పునాదులు నిర్మించే పని మరో 20రోజులు, ఇలా మొత్తం 40రోజులు పడుతుంది. కానీ త్రవ్వకాలు జరపడంతోపాటు పునాదులూ నిర్మించే పని చేపడితే 30రోజుల్లో పని పూర్తవుతుంది. ఒక ఇంజనీరు సమయాన్ని సద్వినియోగం చేయడానికి ప్రణాళికతో బిల్డింగ్ నిర్మించగలిగిన పుడు సృష్టికర్త అయిన అల్లాహ్ అంతకంటే అద్భుతమైన ప్రణాళిక రూపొందించ లేడా? నేటి కాలంలో నిర్మాణ రంగంలో అత్యాధునిక సాఫ్ట్‌వేర్లు వినియోగిస్తున్నారు. ఈ సాఫ్ట్‌వేర్ల సాయంతో అతి తక్కువ కాలంలో ఎక్కువ నిర్మాణ పనుల ప్రణాళిక చేసుకోవచ్చు. ఈ ప్రణాళికతో ఒకే సమయంలో ఎన్నో పనులు చేయవచ్చు. ఒక మానవమాత్రుడు ఇలాంటి ప్రణాళిక చేయగలిగినప్పుడు సృష్టికర్త బహుముఖ పనులు చేసుకోలేడా?

## 3. మొదట సృష్టించినది నింగినా? నేలనా?

ఆయనే ధరణిలో ఉన్న సమస్తాన్నీ మీ కొరకు సృష్టించినవాడు. తరువాత తన ధ్యానాన్ని పైకి మరల్చి సప్తాకాశాలను సృజించిన వాడూ ఆయనే. ప్రతి విషయమూ క్షుణ్ణంగ తెలిసినవాడూ ఆయనే. (ఖుర్ఆన్ 2: 29)

ప్రవక్తా! వారితో ఇలా అను: "భూమిని రెండు రోజులలో సృష్టించిన దేవుణ్ణి మీరు తిరస్కరిస్తారా? ఇతరులను ఆయనకు సమానులుగా నిలబెడతారా? సకల లోకాల వారికి ప్రభువు ఆయనే కదా! (41:9)

ముందుగా అల్లాహ్ భూమిని సృష్టించాడు, ఆ తరువాతనే ఆకాశాలను సృష్టించాడు అన్నది పై ఖుర్ఆన్ వాక్యాల సారాంశం.

మిమ్మల్ని సృష్టించటం కష్టమయిన పనా లేక ఆకాశాన్ని సృష్టించటమా? అల్లాహ్ దానిని నిర్మించాడు, దాని కప్పును బాగా పైకి లేపాడు, తరువాత దానికి సమతూకాన్ని ఏర్పరచాడు దాని రాత్రిని చీకటిగా చేశాడు, దాని పగటిని బహిర్గతం చేశాడు. దీని తరువాత ఆయన భూమిని పరిచాడు. (ఖుర్ఆన్ 79:27-30)

ప్రశ్న : మొదట అల్లాహ్ ఆకాశాన్ని, ఆ తరువాత భూమిని పరిచాడు అన్నది పైవాక్యాల ద్వారా తెలుస్తుంది. పైన తెలిపిన ఖుర్ఆన్ వాక్యాలలో వైరధ్యం కానవస్తుంది కదా?

**జవాబు** : బఖరా అధ్యాయంలో ప్రాధాన్యత దృష్ట్యా మొదటి భూమిని పేర్కొన్నాడేకానీ, నిర్మాణపరంగా చెప్పలేదు. మనిషికి భూమి బాగా తెలిపిన ప్రదేశం. ఆకాశాల గురించి మనిషికి సరైన అవగాహన లేదు. అందుకే భూమి పుట్టుకరీత్యా అత్యంత ప్రాధాన్యత నివ్వబడింది. అంబియా అధ్యాయంలో ఈ సృష్టి ప్రారంభంలో భూమి, ఆకాశం కలిసే ఉన్నాయని, ఇవి రెండూ ఏకకాలంలో ఉనికిలోకి వచ్చాయని చెప్పబడింది. వీటిని వృద్ధిలోకి తెచ్చి, తీర్చిదిద్దే పని ఏకకాలంలోనే జరిగింది.

అల్లాహ్ ముందుగా ఆకాశాన్ని ఆ పిదప భూమిని సృష్టించాడన్న విషయం నాజిఆత్ సూరా వాక్యాల ద్వారా వెల్లడవుతుంది. ఈ విశ్వంలో ఎన్నో గేలాక్సీలు ఉన్నాయి. నక్షత్రాలున్నాయి. ప్రతీ నక్షత్రానికి దాని స్వంత సౌరవ్యవస్థ ఉంది. దాని చుట్టూ గ్రహాలు తిరుగుతున్నాయి. భూగోళ నిర్మాణం పూర్తయ్యాక ప్రకృతి వనరులను సృష్టించి మానవాళికి నివాసయోగ్యంగా తీర్చిదిద్దాడు.

## 4. మానవులు ఏ పదార్థంతో సృష్టించబడ్డారు?

(ఓ ప్రవక్తా) పఠించు, సర్వాన్నీ సృష్టించిన నీ ప్రభువు పేరుతో. ఆయన పేరుకుపోయిన నెత్తుటి ముద్దతో మానవుణ్ణి సృజించాడు. (96:1-2)

(ప్రవక్త మాటలను విశ్వసించకుండా) తిరస్కరించిన వారు ఈ విషయాలను గురించి ఆలోచించరా? ఆకాశాలూ భూమీ పరస్పరం కలసి ఉండేవనీ, తరువాత మేము వాటిని వేరు చేశామనీ, ప్రాణం ఉన్న ప్రతిదానిని నీళ్లతో సృష్టించామనీ? వారు (సృష్టించే మా ఈ శక్తిని) అంగీకరించరా? (ఖుర్ఆన్ 21:30)

మేము మానవుణ్ణి కుళ్ళిన మట్టి యొక్క ఎండిన గారతో సృష్టించాము. (15:26)

ఈసా పుట్టుక ఆదమ్ పుట్టుక వంటిదే. అల్లాహ్ ఆదమును మట్టితో చేసి "అయిపో" అని ఆజ్ఞాపించాడు, అతను అయ్యాడు. (3:59)

"ఏమిటి, నేను చనిపోయిన తరువాత, మళ్లీ నన్ను బ్రతికించటం నిజంగానే జరుగుతుందా?" అని అంటాడు మనిషి. అసలు అతడు ఏమీ కానపుడే మేము అతనిని సృష్టించామన్న విషయం అతడికి జ్ఞాపకం రావటం లేదా? (19:67)

ఆయన మానవుణ్ణి స్వల్పమైన బిందువుతో సృష్టించాడు. చూస్తూ చూస్తూ ఉండగానే అతడు ఒక బహిరంగ వివాదిగా మారిపోయాడు. (16:4)

అతడు (తల్లి గర్భంలో) కార్చబడిన నీచమైన ఒక నీటి బిందువు కాడా? (ఖుర్ఆన్ 75:37)

ఇపుడు వారిని అడగండి. వారిని సృష్టించటం కష్టతరమా లేక మేము సృష్టించిన ఈ సకల చరాచరాలను సృష్టించటం కష్టతరమా అని. వారిని మేము జిగురు వంటి మట్టితో సృజించాము. (37:11)

ప్రశ్న : మనిషి పుట్టుక గురించి పైన చెప్పిన ఖుర్ఆన్ వాక్యాలలో వైరుధ్యం లేదా?

**జవాబు** : పై వాక్యాలలో ఎలాంటి వైరుధ్యమూ లేదు. మనిషి పుట్టుక వివిధ దశలు వివరించబడ్డాయి.

ఒక్కో దశలో శిశువు ఆకారం, నిర్మాణం, ఒక్కోలా ఉంటాయి. మనిషి నిజ స్వరూపాన్ని వివరించేందుకు 'ఒకప్పుడు అతను ఏమీలేని స్థితినుండి తీసుకోవడం జరిగింది' అనే విషయాన్ని వివరించాడు. మొదట ఆది మానవుడైన ఆదమ్‌ను మట్టితో సృష్టించాడు. మట్టితో ఆదమ్‌ను ఎలా చేశాడు అన్న విషయం మనకు తెలియదు. ఆ మట్టి ఎలాంటిదంటే కుళ్లిన, ఎండిన గార మట్టి. మట్టిని కూడా వివిధ దశల్లో రూపాంతరం చెందించారు. మన శరీరావయవాలన్నింటికీ మూలం మట్టి. మనం తినే ఆహారం మట్టిలోనే పండుతుంది. నీళ్లతో ప్రతీ జీవినీ సృష్టించాడు. మైక్రోస్కోపుతో ఏ జీవిని పరిశీలించినా 80శాతం నీరే ఉంటుంది. నీటితోనే ప్రతీ జీవి ప్రాణం పోసుకుంటుంది. వీర్య బిందువుతో మనిషి పుట్టించబడ్డాడని చెప్పబడింది. మట్టిలో నుండి ఉత్పత్తి అయ్యే ఆహారం తీసుకోవడం వల్ల మగ వారిలో శుక్రకణాలు, ఆడవారిలో అండాలు ఉత్పత్తి అయ్యే వ్యవస్థ తయారు చేయ బడింది. ఇద్దరూ శారీరక కలయిక వల్ల మొదటి కణం ఉనికిలోనికి వస్తుంది. ఈ కణం విభజన చెంది రక్తం ముద్దగా మారుతుంది. తల్లి గర్భానికి అతుక్కుని ఉంటుంది. తల్లి నుండి రక్తం సరఫరా అవుతుంది. తల్లి కడుపులో శిశువు రూపం రక్తం ముద్దలా ఉంటుందని స్కానింగ్ ద్వారా తెలుస్తుంది. తల్లి గర్భంలో శిశువు దశలను గురించి ఖుర్ఆన్ విపులంగా తెలియజేస్తుంది. "మేము మానవుణ్ణి మట్టియొక్క సారంతో సృష్టించాము తరువాత అతనిని ఒక సురక్షితమైన స్థానంలో పడే బిందువుగా మార్చాము, ఆ తరువాత ఈ బిందువుకు ముద్ద ఆకారాన్ని ఇచ్చాము, ఆపైన ముద్దను కండగా చేశాము, తరువాత మాంసపు కండను ఎముకలుగా చేశాము, ఆ తరువాత ఎముకలకు మాంసాన్ని తొడిగాము, ఆపైన దానిని భిన్నమైన సృష్టిగా చేసి నిలబెట్టాము." (23:12-14)

పై వాక్యాలు మనిషి పుట్టుక దశలను గురించి చెప్పాయే కానీ వాటిలో ఎలాంటి వైరుధ్యమూ లేదు. 1450 సంవత్సరాల క్రితం ఎలాంటి మెడికల్ టెక్నాలజీ లేని కాలంలో మనిషి పుట్టుక దశలను వివరించింది ఖుర్ఆన్. సృష్టికర్త మాత్రమే ఇంతటి జ్ఞానాన్ని అందించగలడు. ఖుర్ఆన్ అల్లాహ్ గ్రంథమనడానికి ఇంతకు మించిన నిదర్శనాలు ఇంకేం కావాలి?




# హత్యలు.. కూల్చివేతలు

## - ఏపీసీఆర్ నివేదిక

**జూన్ 4న** ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచి దేశవ్యాప్తంగా ముస్లిం వ్యతిరేక హింస పెరిగిందని అసోసియేషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ సివిల్ రైట్స్ (APCR) నివేదిక వెల్లడించింది. హత్యలు, మతపరమైన హింస, ముస్లింల ఇళ్లను కూల్చివేయడం వంటి ఘటనలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి.

APCR.. భారతదేశంలో పౌర హక్కుల సాధన కోసం న్యాయ వాదులు, పాత్రికేయులు, పరిశోధకులు, పారాలీగల్ వాలంటీర్‌లతో కూడిన ఒక న్యాయసేవా సంస్థ. ఈ సంస్థ ఇటీవలె దేశవ్యాప్తంగా మైనారిటీలపై జరిగిన హింసపై ఓ నివేదికను మీడియాకు విడుదల చేసింది. ముస్లిములపై జరిగిన హత్యలు, మూక దాడులు, కూల్చివేతలపై సమగ్ర నివేదిక...

➢ జూన్ 22న గుజరాత్‌లో, చిఖోద్రాలో క్రికెట్ మ్యాచ్ చూడటానికి వెళ్లిన సల్మాన్ వోహ్రా అనే 23 ఏళ్ల ముస్లిం యువకుడిని ఓ వర్గం గుంపు కనికరం లేకుండా కొట్టి చంపింది.

➢ ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో జూన్ 7న ముగ్గురు ముస్లిం పురుషులపై హిందూత్వ మూక దాడికి పాల్పడ్డారు.

➢ సహరన్‌పూర్ జిల్లాకు చెందిన సద్దాం ఖురేషీ మరియు అతని బంధువు చాంద్ మియా ఖాన్, ఉత్తరప్రదేశ్‌లోని షామ్లీ జిల్లాకు చెందిన గుడ్డు ఖాన్ పశువులను రవాణా చేస్తుండగా, రాయ్‌పూర్‌లో హిందుత్వ మూక వారిని వెంబడించి దాడి చేసింది. ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందగా, కోమాలో ఉన్న మరొకరు 10 రోజుల తర్వాత మరణించారు.

➢ జూన్ 18న అలీఘర్‌లో, ఔరంగజేబ్ అలియాస్ ఫరీద్‌గా గుర్తించబడిన 35 ఏళ్ల ముస్లిం వ్యక్తిని ఓ మూక దారుణంగా కొట్టి చంపింది, పశ్చిమ యూపీలోని మత ఉద్రిక్తతకు దారితీసింది. మూక హింసపై ఎలాంటి విచారణ జరగలేదు.

➢ కోల్‌కతాలో ఇర్షాద్ ఆలం అనే ముస్లిం వ్యక్తిని కట్టివేసి కొట్టి చంపారు.

### మత ఘర్షణలు..

➢ జూన్ 17న బక్రీద్ సందర్భంగా... తెలంగాణలోని మెదక్‌లో జూన్ 15న మదర్సాపై అతివాద మూకలు జరిపిన దాడిలో పలువురు గాయపడ్డారు.

మిన్హాజ్ ఉల్ ఉలూమ్ మదర్సా యాజమాన్యం బక్రీద్ కోసం బలి ఇవ్వడానికి పశువులను కొనుగోలు చేసింది. బలి పశువులను తీసుకొచ్చిన తర్వాత స్థానిక హిందుత్వ మూక మదర్సా సమీపంలో గొడవ సృష్టించారు. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని గుంపును చెదరగొట్టారు.

➢ ఒడిశాలోని బాలాసోర్, ఖోర్ధాలో మత ఘర్షణల కారణంగా ప్రభుత్వం వారం రోజులపాటు కర్ఫ్యూ విధించింది, అయితే ఆ ప్రాంతంలో జంతుబలిని వ్యతిరేకిస్తూ వీధుల్లోకి వచ్చిన హిందూత్వ గుంపు ముస్లిముల ఇళ్లలోకి ప్రవేశించి ధ్వంసం చేయడం కనిపించింది.

➢ హిమాచల్ ప్రదేశ్‌లోని నహాన్‌లో జూన్ 19న, ఒక ముస్లిం వ్యక్తికి చెందిన ఒక వస్త్ర దుకాణం, దుకాణదారుడు తన వాట్సాప్ స్టేటస్‌లో జంతుబలి చిత్రాన్ని షేర్ చేయడంతో పెద్ద సంఖ్యలో హిందువులు దోచుకున్నారు, ధ్వంసం చేశారు.

➢ జూన్ 22న జోధ్‌పూర్‌లోని జలోరీ గేట్‌లో కూడా మతపరమైన ఉద్రిక్తతలు చెలరేగాయి. ఫలితంగా రాళ్ల దాడి జరిగింది. కనీసం 16 మంది గాయపడ్డారు. ఈద్గా వెనుక గేటు నిర్మాణం వల్ల ఆ ప్రాంతంలో ముస్లింల రాకపోకలు పెరుగుతాయని ఆ ప్రాంత వాసులు వ్యతిరేకించడంతో ఈ ఘటన చోటుచేసుకుంది.

### ఇళ్ల కూల్చివేత

➢ ఆవు మాంసం ఉందని, మాండ్లా జిల్లాలో కనీసం 11 ముస్లిం ఇళ్లను మధ్యప్రదేశ్ అధికార యంత్రాంగం కూల్చివేసింది. ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్నారని పేర్కొంటూ పోలీసులు కూల్చివేతను సమర్థించారు.

➢ జూన్ 14న, ఎంపీలోని అధికారులు రత్లాం జిల్లాలోని జవ్రాలోని ఒక ఆలయంలో అవశేషాలను విసిరివేశారనే నెపంతో నలుగురు ముస్లిం పురుషుల ఇళ్లను కూల్చివేశారు.

➢ లోక్‌సభ ఎన్నికలు ప్రకటించిన కొద్ది రోజులకే ఉత్తరప్రదేశ్ రాజధాని నగరం లక్నోలోని అక్బర్‌నగర్ ప్రాంతంలో ఇటీవల మరో భారీ కూల్చివేత జరిగింది.

వరుస సంఘటనలలో, ఉత్తరప్రదేశ్ పోలీసులు "పశువుల అక్రమ రవాణా" లేదా గొడ్డు మాంసం అమ్మకంపై ఆరోపణలు ఎదుర్కొంటున్న ముస్లింల ఆస్తులను స్వాధీనం చేసుకున్నారు.

తాజా కేసులో, గొడ్డు మాంసం విక్రయిస్తున్నాడన్న ఆరోపణలపై పిలిభిత్ జిల్లాలో యూపీ అధికార యంత్రాంగం ఒక ముస్లిం వ్యక్తికి చెందిన రూ.15,89,000 విలువైన ఇల్లు, ఇతర ఆస్తులను జప్తు చేసింది.

➢ ఉత్తరప్రదేశ్‌లోని మురాదాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ (MDA) హిందూ మహిళను కిడ్నాప్ చేయడానికి ప్రయత్నించారని ఆరోపణ ఎదుర్కొంటున్న ముస్లిం కుటుంబాలకు చెందిన ఆరు ఇళ్లను కూల్చివేసింది.

## దైవ త్రాటిని దృఢంగా ఆశ్రయించడానికి...

**- అమీన్ అహ్సన్ ఇస్లాహి (రహ్మ)**

దైవత్రాటిపై స్థిరంగా ఉండటానికి, ప్రజలను దానిపై స్థిరంగా ఉంచడానికి ఉమ్మత్‌కు (ముస్లిమ్ సముదాయానికి) చేయబడిన కర్తవ్య బోధ ఏమిటంటే, ఈ లక్ష్యం కొరకు ముస్లింలు తమలో నుండి ఒక వర్గాన్ని ఈ కార్యం కొరకు నియుక్తం చేయాలి. వారు ప్రజా బాహుళ్యాన్ని శుభం వైపునకు, మేలు వైపునకు పిలుపు ఇస్తూ ఉండాలి. మంచిని పెంపొందించమని ఆదేశించాలి. చెడుల నుండి నిరోధించాలి. మంచీ చెడులు (మారూఫాత్– మున్కరాత్) అంటే అర్థం షరీఅత్‌కు, సముదాయానికి సంబంధించిన మంచీ చెడులు. దీని కొరకు అమ్ర్ (ఆజ్ఞాపించటం), నహీ (నిరోధించటం) అనే పదాలు ప్రయోగించబడ్డాయి. ఈ పని కేవలం ప్రసంగాలతో, హితబోధలతో అయ్యేది కాదు. దీని కొరకు అధికార బలం అవసరం. ముస్లిం సముదాయం తరపున పూర్తి రాజకీయ, అధికార ప్రాబల్యం లేనంతవరకూ ఇది సాధ్యమయ్యేది కాదు. ఒకవేళ కేవలం సందేశ ప్రచారం ద్వారానే ఈ కార్యాన్ని నిర్వహించే మాటైతే, ఈ ఉద్దేశాన్ని నెరవేర్చటానికి **యద్‌ఊన ఇలల్ ఖైర్** (మంచి వైపునకు పిలిచేవారు తప్పకుండా ఉండాలి) అనే వాక్యమే సరిపోయేది. **యామురూన బిల్ మారూఫి వ యన్‌హౌన అనిల్ మున్కర్** (మేలు చెయ్యండి అని ఆజ్ఞాపించేవారు, చెడు నుండి వారించేవారు కొందరు తప్పకుండా ఉండాలి) అని చెప్పాల్సిన అవసరం ఉండేదే కాదు. మా దృష్టిలో ఈ ఆయత్‌కు కార్యరూపం ఇవ్వడానికి ఈ ఉమ్మత్‌లో ఖిలాఫత్ వ్యవస్థ నెలకొనాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. అందుకే ఈ ఆజ్ఞాపాలనకై ముస్లింలు దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వ సల్లమ్) పరమపదించగానే చేసిన మొట్టమొదటి పని ప్రాతినిధ్య (ఖిలాఫత్) వ్యవస్థను నెలకొల్పటం. ముస్లింలు దైవత్రాటిని దృఢంగా పట్టుకోవలసిన ధ్యేయం నుండి వైదొలగకుండా కాపాడటం ఈ వ్యవస్థ యొక్క మౌలిక ఉద్దేశం. దీనికోసం అవలంబించవలసిన విధానాలు సూత్రప్రాయంగా మూడు. 1) మేలు (శుభం) వైపునకు పిలుపు, 2) మంచిని చెయ్యమని ఆజ్ఞాపించటం, 3) చెడుల నుండి వారించటం. ఈ మూడు సూత్రప్రాయమైన విధానాల ద్వారానే సన్మార్గగాములైన ఖలీఫాల హయాంలో– మిల్లత్ ఆంతరంగిక, బాహ్యపరమైన బాధ్యతలను సజావుగా నెరవేర్చే విభాగాలు (డిపార్ట్‌మెంట్‌లు) అన్నీ ఉనికిలోకి వచ్చాయి.

**(తదబ్బురె ఖుర్ఆన్– ఆలె ఇమ్రాన్ సూరా 104, 105 ఆయత్‌ల విశదీకరణ)**

# ఫ్రాన్స్ రాజకీయాల్లో కొత్త శకం

- రూహీ

**ఇటీవల** ఫ్రాన్స్ పార్లమెంటు ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల ఫలితాలు వాటి ప్రభావాలపై ప్రపంచవ్యాప్తంగా విస్తృత చర్చ జరుగుతోంది. ఈ ఎన్నికల అనూహ్య ఫలితాలు దేశంలో రాజకీయ సంక్షోభానికి, అనిశ్చితికి కారణమవుతాయన్న భయాలు కూడా ఉన్నాయి. ఫ్రాన్సు అంతర్గత విధానాలపై, విదేశీ సంబంధాలపై కూడా ఈ ఫలితాల ప్రభావం బలంగా ఉంటుంది.

ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు రాజకీయాలు మారుతున్నాయి. ముఖ్యంగా గతంలో ఇస్లామోఫోబియా ప్రచారం చేసి గెలుపొందిన పార్టీలు ఎదురుదెబ్బలు తింటున్నాయి. మతతత్వాన్ని నమ్ముకున్న పార్టీలను ప్రజలు తిరస్కరిస్తున్నారు. అనేక దేశాల్లో రైటిస్టు పార్టీలు రాజకీయంగా దెబ్బతిన్నాయి. భారతదేశంలో, నరేంద్ర మోడి నాయకత్వంలోని బిజెపికి పెద్ద దెబ్బ తగిలింది. మెజారిటీని కోల్పోయి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటు చేయవలసి వచ్చింది. అదే విధంగా బ్రిటనులో కన్జర్వేటివ్ పార్టీ చారిత్రక పరాజయాన్ని ఎదుర్కొంది. లేబర్ పార్టీ ప్రభుత్వం ఏర్పడింది. ఇప్పుడు, ఫ్రాన్స్‌లో మారిన్ లెపెన్ నేతృత్వంలోని మతతత్వ పార్టీ కూడా పరాజయం ఎదుర్కొంది.

వామపక్ష సంకీర్ణం అనూహ్య విజయాలు సాధించింది. పార్లమెంటు ఎన్నికలలో అత్యధిక సీట్లు సాధించింది. మాక్రోన్ సెంట్రిస్ట్ కూటమి రెండవ స్థానంలో నిలిచింది, మరిన్ లె పెన్ పార్టీ మూడవ స్థానంలో నిలిచింది. ఏ కూటమికి కూడా పూర్తి మెజారిటీ లేకపోవడం వల్ల ఫ్రాన్స్ ఇప్పుడు రాజకీయ, ఆర్థిక అస్థిరతకు గురయ్యే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఫ్రాన్సు అధ్యక్షుడు మాక్రాన్‌కు ప్రజల్లో పరపతి బాగా దెబ్బతింది. ఆయన ఇప్పుడు ఒక బలహీనమైన, మెజారిటీ లేని, మిత్రపక్షాలపై ఆధారపడిన సంకీర్ణ ప్రభుత్వాన్ని నడపవలసి వస్తోంది.

ఫలితాలు వచ్చిన వెంటనే ఫ్రాన్స్ ప్రధాని గాబ్రియెల్ అటాల్ రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించాడు. పరిస్థితి ఎంత సున్నితంగా ఉందో దీన్ని బట్టి అర్థమవుతుంది. మాక్రోన్ నాయకత్వంలోని సెంట్రిస్ట్ కూటమికి మెజారిటీ దక్కలేదు. అనేక ఒత్తిళ్ళతో కూడుకున్న సంక్లిష్ట రాజకీయ పరిస్థితులను మాక్రాన్ ఎంత సమర్థవంతంగా ఎదుర్కుంటాడో వేచి చూడాలి. పైగా అనేక విషయాల్లో తీవ్రంగా విభేదిస్తున్న ప్రధానితో కలిసి ప్రభుత్వాన్ని నడపవలసి ఉంది.

ఇప్పుడు అధికారం చేపట్టిన కొత్త కూటమి మాక్రోన్ విధానాలను చాలా విషయాల్లో వ్యతిరేకిస్తుంది. ముఖ్యంగా హిజాబ్ నిషేధం వంటి ముస్లిములపై వివక్షతో కూడినా ఆంక్షల పట్ల వ్యతిరేకత స్పష్టంగా ముందుకు వస్తోంది. వామపక్ష కూటమి ఉదారవాద, పురోగమనా వైఖరిని ప్రదర్శిస్తోంది. ముస్లిం వివక్షను, ముస్లిం వ్యతిరేక చర్యలను తీవ్రంగా ప్రతిఘటించడం ఖాయం. హిజాబ్ నిషేధం వంటి విధానాల్లో సడలింపులు వచ్చే అవకాశాలున్నాయి. మత స్వేచ్ఛను ప్రోత్సహించడంతో పాటు ముస్లిములను లక్ష్యంగా చేసుకున్న చర్యలు ఇప్పుడు తగ్గుముఖం పడతాయి.

విదేశీ విధానాల విషయానికి వస్తే, వామపక్ష కూటమి అంతర్జాతీయ సమస్యలపై మాక్రాన్ విధానాన్ని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా గాజా విషయంలో, ఇస్రాయీల్-పలస్తీనా వివాదం విషయంలో ఫ్రాన్సు వైఖరి మారవచ్చు. వామపక్షాలు సాధారణంగా పలస్తీనీయుల హక్కులను సమర్థిస్తున్నాయి. రెండు- దేశాల పరిష్కారానికి బలమైన మద్దతు ఇస్తున్నాయి. అందువల్ల ఇప్పుడు మాక్రోన్ సమతుల్యంగా వ్యవహరించక తప్పదు. ఇజ్రాయెల్‌కు ఇస్తున్న గుడ్డి మద్దతు ఇప్పుడు ఉండకపోవచ్చు. ఈ మార్పులు హఠాత్తుగా రాకపోవచ్చు కాని నెమ్మదిగా రాకతప్పదు. మాక్రోన్ అనుసరించే సెంట్రిస్ట్ వైఖరి రాజకీయ ప్రయోజనాలు ఇవన్నీ దీన్ని ప్రభావితం చేస్తాయి.

ప్రవాసుల సమస్య మరో ముఖ్యమైన సమస్య. వామపక్ష కూటమి ఈ విషయంలో ఉదారవైఖరి ప్రదర్శిస్తుంది.

తృతీయ ప్రపంచ దేశాలు, ముస్లిం మెజారిటీ దేశాల నుండి ప్రవాసుల పట్ల ఫ్రాన్సు విధానాల్లో సడలింపులు పెరిగే అవకాశం ఉంది. మాక్రాన్ గతంలో మాదిరిగా ప్రవాసుల పట్ల కఠినమైన విధానాలు పాటించే అవకాశాలు ఇప్పుడు లేవు. ఈ మార్పు మరింత మానవతావాద దృక్పథంతో, శరణార్థులు, ఆశ్రయం కోరేవారిని ఆదుకునే వైఖరికి దారితీస్తుంది.

మాక్రాన్ నిజానికి ముందస్తు ఎన్నికలు ప్రకటించి రిస్కు తీసుకున్నారని చాలా మంది భావిస్తున్నారు. ఎన్నికల్లో ప్రజామద్దతు పొందడం ద్వారా బలపడాలని అనుకున్నారు. కాని ప్రజలు ఆయనకు మద్దతివ్వలేదు. వామపక్ష భావాలు, మతతత్వ భావాలు, సెంట్రిస్టు భావాల ఓటర్లందరిలోను ఒకవిధమైన నిరసన ఈ ఎన్నికల ఫలితాల్లో వెల్లడయ్యింది. ఫలితంగా కార్పోరేట్ అనుకూల మాక్రాన్ విధానాలను వ్యతిరేకించే వారే ఎక్కువగా ఎన్నికయ్యారు.

క్లుప్తంగా ఫ్రాన్సు ఎన్నికల ఫలితాలు రాబోయే అనేక మార్పులకు సూచికలుగా భావించవచ్చు. వామపక్షాలు బలపడడం వల్ల ఉదారవాద, సమానతా విధానాలు, విదేశీ వ్యవహారాల్లో న్యాయబద్ధ వైఖరి పెరిగే అవకాశం ఉంది. బలహీనుడైన అధ్యక్షుడు మాక్రాన్ సవాళ్ళను అధిగమిస్తూ ఎలా పాలిస్తారో వేచి చూడాలి. ❖

# నెల రోజుల్లో పదమూడు మూకహత్యలు

- ఆయెషా

**పశ్చిమ బెంగాల్**లో వరుసగా మూకహత్యలు జరుగుతున్నాయి. మొన్న జూలై 7న మరో మూక దాడి జరిగింది. కోల్‌కతాలోని భాంగార్ ప్రాంతంలో దొంగగా అనుమానించి ఒక ముస్లిం వ్యక్తిని తీవ్రంగా కొట్టి చంపేశారు.

బాధితుడు ఫుల్బారికి చెందిన అజ్గర్ ముల్లా. భాంగార్ పోలీస్ స్టేషన్‌కు కేవలం 500 మీటర్ల ఆయన మృతదేహం దొరికింది. అజ్గర్ ముల్లాపై దాడి జరుగుతున్నప్పుడు అతన్ని కాపాడ్డానికి ఎవరు ముందుకు రాలేదని కుటుంబసభ్యులు ఆరోపించారు.

మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం పంపించామని, దర్యాప్తు ప్రారంభించామని పోలీసులు తెలిపారు.

నరేంద్ర మోడి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత, ఉత్తర భారతదేశంలోను, తూర్పు భారతదేశంలోను ముస్లింలపై హింసాత్మక దాడులు మరింత పెరిగాయి.

జూన్ 4 తర్వాత ఇది 13వ మూకహత్య. ఛత్తీస్‌గఢ్‌లో నాలుగు, పశ్చిమ బెంగాల్‌లో ఐదు, ఉత్తరప్రదేశ్‌లో రెండు, గుజరాత్‌లో ఒకటి, జార్ఖండ్‌లో ఒకటి మూకహత్యలు జరిగాయి.

జూన్ 4 తర్వాత మూకహత్యల్లో మరణించిన ముస్లిముల సంఖ్య 9కి చేరుకుంది. ఒక క్రిస్టియన్ మహిళ, ముగ్గురు దళితులు కూడా ఈ మూకదాడుల్లో మరణించారు.

పశ్చిమ బెంగాల్‌లో రెండు వారాల్లో 15 కంటే ఎక్కువ



మూకదాడులు జరిగాయి. ఇందులో ఐదుగురు మరణించారు. చాలా సందర్భాల్లో ఇవి కేవలం పుకార్లుగా కొట్టివేయడం జరుగుతుందని బాధితుల బంధువులు ఆరోపించారు. మరణించిన వారంతా ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడ్డ సమూహాలకు చెందినవారు. ఈ సంఘటనల్లో 60 మందికి పైగా నిందితులను అరెస్టు చేయడం జరిగింది. మమతా బెనర్జీ ప్రభుత్వం మూకహత్యల్లో మరణించిన వారి కుటుంబాలకు రూ. 2 లక్షల పరిహారం ప్రకటించింది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం 2019లో పశ్చిమ బెంగాల్ మూకహత్యల నివారణ బిల్లును ఆమోదించింది. ఈ బిల్లు చట్టమైతే మూకహత్యల కేసుల్లో నేరస్తులకు మరణశిక్ష వరకు విధించే కఠినమైన నిబంధనలున్నాయి. కాని బిల్లును గవర్నరు ఇంతవరకు ఆమోదించలేదు.




## క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి

జులై 1 నుంచి అమల్లోకి వచ్చిన భారతీయ న్యాయ సంహిత అనే మూడు కొత్త క్రిమినల్ చట్టాలను వెంటనే ఉపసంహరించు కోవాలని కేంద్ర కార్మిక సంఘాల వేదిక, స్వతంత్ర ఫెడరేషన్లు పిలుపునిచ్చాయి. కేంద్ర కార్మిక సంఘాలు సంయుక్తంగా పాత చట్టాలను తిరిగి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరుతూ ప్రకటన విడుదల చేశాయి. ఏవైనా మార్పులు ప్రతిపాదిస్తే, వాటిని ఆమోదించడానికి, అమలు చేయడానికి ముందే పబ్లిక్ డొమైన్‌లో చర్చించాలని అన్నాయి. ఎందుకంటే సరైన సంప్రదింపులు లేకుండా, పార్లమెంటరీ కమిటీ ఇచ్చిన సూచనలను కూడా పట్టించుకోకుండా, బిల్లు ముసాయిదాను బహిరంగంగా అందుబాటులో ఉంచకుండా ఈ చట్టాలను ప్రజలపై బలవంతంగా రుద్దారని విమర్శించాయి. వీటిని బ్రిటిష్ కాలం నాటి చట్టాల స్థానంలో తీసుకొచ్చామని చెప్పి సమర్థించుకోవడం దారుణమని, ఇందులో గత చట్టాల్లోని అన్ని నిబంధనలు ఉన్నాయని తెలిపాయి. వాటిలో కొన్నింటిని మరింత కఠినతరం చేశారని విమర్శించాయి.

## ఇద్దరు జర్నలిస్టులపై ఎఫ్ఐఆర్

ఉత్తరప్రదేశ్‌లో ఒక ముస్లిం వ్యక్తిపై జరిగిన మూకదాడి గురించి సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినందుకు ఇద్దరు జర్నలిస్టులతో సహా ఐదుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడాన్ని వివిధ మీడియా సంస్థలు తీవ్రంగా ఖండించాయి. ఈ నెల 5న షామ్లీ జిల్లాలోని జలాలాబాద్ పట్టణంలో దొంగతనం చేశాడనే ఆరోపణలతో ఖురేషి అనే స్క్రాప్ వర్కర్‌పై మూకదాడి జరిగింది. ఈ దాడిలో కొట్టిన దెబ్బలతో ఖురేషి మరణించాడు. ఈ ఘటనపై ఎఫ్ఐఆర్ కూడా నమోదయింది. ఈ మూక దాడి గురించి జర్నలిస్టులు జాకిర్ అలీ త్యాగి, వసీం అక్రమ్ త్యాగి, మరో ముగ్గురు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. మరణించిన ఖురేషి ఫొటోను, ఖురేషి కుటుంబ సభ్యులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను, దాడిలో పాల్గొన్న కొంత మంది వ్యక్తుల పేర్లను పోస్టు చేశారు. దీంతో వీరిపై ఉత్తరప్రదేశ్ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నూతన క్రిమినల్ చట్టాల్లోని సెక్షన్ 196 (వివిధ గ్రూపుల మధ్య శత్రుత్వాన్ని ప్రోత్సహించడం), సెక్షన్ 353 (ప్రజల మధ్య విభజనకు కారణమయ్యే ప్రకటనలు చేయడం) కింద పోలీసులు అభియోగాలను మోపారు. దీనిని ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ వుమెన్స్ ప్రెస్ కార్ప్స్, డిజిఐపియు తీవ్రంగా ఖండించాయి. ఈ ఎఫ్ఐఆర్‌తో క్రిమినల్ చట్టాలను దుర్వినియోగం చేశారని విమర్శించాయి.

## మణిపూర్ సందర్శనకు సమయం లేదు కానీ...

ప్రధాని రష్యా పర్యటనపై కాంగ్రెస్ విమర్శలు గుప్పించింది. ప్రధానికి మణిపూర్‌ను సందర్శించేందుకు సమయం లేదు.... కానీ మాస్కో పర్యటనకు వెళ్లారని కాంగ్రెస్ విరుచుకుపడింది. గతేడాది మే 3న తీవ్ర సంక్షోభం నెలకొన్న మణిపూర్‌ను సందర్శించేందుకు ప్రధానికి కొన్ని గంటల సమయం కూడా లేదని, కనీసం రాష్ట్ర సందర్శనకు కూడా మొగ్గు చూపడంలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ విమర్శించారు. మణిపూర్‌లోని తన సొంత పార్టీకి చెందిన రాజకీయ నేతలను, ఎమ్మెల్యేలను, ఎంపిలను కూడా ప్రధాని కలవలేదని విమర్శించారు. లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అస్సాం, మణిపూర్ వెళ్తుండగా, దేశ ప్రధాని మాత్రం మాస్కో పర్యటనకు వెళుతున్నారని అన్నారు. మోడీ కొంతకాలం పాటు రష్యా-ఉక్రెయిన్ యుద్ధాన్ని నిలిపివేసినట్లు గోడీ మీడియా ప్రగల్భాలు ప్రచారం చేసిందని, ఇప్పుడు ఈ మాస్కో పర్యటన మరో విచిత్ర వాదనకు దారితీయవచ్చని అన్నారు.

## హింస, అవినీతిని నిరోధించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలు చేపట్టాలి

కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ముస్లిం సామాజిక వర్గానికి చెందిన వారిపై దాడులు జరుగుతున్నాయి. ముస్లింలు బీజేపీకి ఓటు వేయలేదని ఇలా దాడులు చేయడం అప్రజాస్వామికం, అమానవీయమని జమాఅతె ఇస్లామీ హింద్ ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ సలీం ఇంజనీర్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని జమాఅత్ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లోక్ సభ ఎన్నికల ఫలితాలు వెల్లడయిన తరువాత దేశంలోని వివిధ ప్రాంతాలలో మతపరమైన ఉద్రిక్తతలు, మూకదాడులు పెరిగాయన్నారు. క్రిమినల్ చట్టాలు ప్రజలకు వ్యతిరేకంగా ఉన్నాయని అన్నారు. నీట్ పరీక్షలలో జరిగిన అవకతవకల గురించి మాట్లాడుతూ, NTA (నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) అంత పెద్ద ఎత్తున పరీక్షా ఏర్పాట్లను నిర్వహించ లేకపోయిందన్నారు. కాబట్టి ఈ పరీక్షలను రాష్ట్ర ప్రభుత్వాల పర్యవేక్షణలో నిర్వహించాలని పేర్కొన్నారు.

## ఈరాన్ అధ్యక్షునిగా మసూద్ పెజెష్కియాన్



ఈరాన్ అధ్యక్షుడిగా మసూద్ పెజెష్కియాన్ ఎన్నికయ్యారు. ప్రత్యర్థి జలీలి పై ఆయన 29 లక్షలకు పైగా ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. విజయం అనంతరం పెజెష్కియాన్ మాట్లాడుతూ, మన ముందున్నది క్లిష్టతరమైన బాట. ప్రజల ఆదరాభిమానాలతో ఈ ప్రయాణం సాఫీగా, సజావుగా సాగిద్దాం. ఈ ప్రయాణంలో మిమ్మల్ని ఒంటరిగా వదిలేసి వెళ్లేది లేదని ఆయన ప్రజలకు హామీనిచ్చారు. 3 కోట్లకు పైగా ఓట్లు పోలవగా, పెజెష్కియాన్‌కు కోటీ 64లక్షల ఓట్లు వచ్చాయి. ఆయన ప్రత్యర్థికి కోటీ 35లక్షల ఓట్లు లభించాయి. 'పెజెష్కియాన్ ఇరాన్ తదుపరి అధ్యక్షుడయ్యారు' అని హోం శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

## నెతన్యాహు తప్పుకో...



గాజాలో ఇజ్రాయిల్ దాడులు ప్రారంభించి తొమ్మిది మాసాలు గడిచిన నేపథ్యంలో యుద్ధోన్మాది నెతన్యాహు ప్రధాని పదవి నుంచి తప్పుకోవాలని,తక్షణమే కాల్పుల విరమణ పాటించాలని, హమాస్ చెరలో వున్న బందీలను విడిచి పెట్టాలని కోరుతూ ఇజ్రాయిలీలు దేశవ్యాప్తంగా నిరసనలు చేపట్టారు. ఒప్పందం కుదర్చడానికి అంతర్జాతీయ మధ్యవర్తులు కృషి చేస్తున్న తరుణంలో ఈ ప్రదర్శనలు చోటు చేసుకున్నాయి. శాంతి చర్చలకు ఒక వైపు సిద్ధమంటూనే, మరో వైపు తాను కుదుర్చుకునే ఏ ఒప్పందమైనా హమాస్‌పై దాడుల కొనసాగించేందుకు అనుమతించేలా ఉండాలని నెతన్యాహు అన్నారు.

## స్వపక్షంలోనే బైడెన్‌కు వ్యతిరేకత..



అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై పోటీ నుంచి డెమోక్రాటిక్ పార్టీ నామినీ జో బైడెన్ వైదొలగాలన్న డిమాండు రోజురోజుకీ పెరుగుతోంది. తాజాగా సొంత పార్టీలోని కీలక ప్రతినిధులే ఆయన వైదొలగాలని పట్టుబడుతున్నారు. ప్రతినిధుల సభలోని మైనారిటీ నేత హకీం జెఫరీస్ ఏర్పాటు చేసిన సమావేశంలో చాలా మంది బైడెన్ నిష్క్రమించాలని అభిప్రాయపడ్డారు. ట్రంప్‌తో సంవాదంలో బైడెన్ తడబడిన తర్వాత ఆయన అభ్యర్థిత్వంపై వివిధ వర్గాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో దీనిపై ఓ స్పష్టతకు వచ్చేలా కీలక నేతలతో హకీం సమావేశం ఏర్పాటు చేశారు. ప్రతినిధుల సభలో మళ్లీ మెజారిటీ సాధించాలంటే బైడెన్ పోటీలో ఉండొద్దని పలువురు కీలక నేతలు అభిప్రాయపడ్డట్లు సమావేశంలో పాల్గొన్న వర్గాలు వెల్లడించాయి.

## గజాలో ఆకలి కేకలు

ఇజ్రాయిల్ దాడుల ఫలితంగా గాజాలో 5 లక్షల మంది ప్రజలు ఆకలి విపత్తును ఎదుర్కొంటున్నారని ఐరాస ఏజెన్సీలు చెబుతున్నాయి. ఇస్రాయిల్ దాడుల వల్ల ఇప్పటివరకు గజాలో 38,098 మంది చనిపోయారు. మరో 87, 705 మంది గాయపడ్డారు. వీరిలో ఎక్కువ మంది మహిళలు, పిల్లలు ఉన్నారు. ఈ దాడి గాజాలో 90 శాతం మంది పాలస్తీనీయులను శరణార్థులుగా మార్చింది. ఇళ్లు, ఇతర మౌలిక సదుపాయాలను నాశనం చేసింది. పాలస్తీనాలో హింసను ఆపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి.



# సర్వ మానవాళికి మార్గదర్శకం– దివ్య ఖుర్‌ఆన్ సందేశం

- ముహమ్మద్ వహీదుద్దీన్

**దివ్య ఖుర్‌ఆన్** గ్రంథం దైవం తరఫున అవతరించిన చిట్టచివరి గ్రంథం. ప్రపంచ చరిత్రలో చాలా తక్కువ సమయంలో ప్రపంచ గతిని మార్చిన ఏకైక గ్రంథం. ఎలాంటి మార్పులు చేర్పులకు గురికాని, దానవులుగా ప్రవర్తించే వారిని కూడా ఎంతో ఉత్తమ గుణాలు గల మనుషులుగా తీర్చిదిద్దిన ఉత్తమ గ్రంథం ఖుర్‌ఆన్ మాత్రమే. పవిత్ర గ్రంథ బోధనలు ముస్లిములకే కాదు మనుషులందరికీ మంచి దారి చూపుతాయి. సమాజం నుండి దురాచారాలు, దోపిడీ, దౌర్జన్యాలను అవినీతి, రుగ్మతలను రూపుమాపిన గ్రంథం. మానవుని సంపూర్ణ జీవితానికి దిశా నిర్దేశనం చేసే అనేక బోధనలున్నాయి ఈ ఆకాశ గ్రంథంలో...

## ప్రపంచ శాంతియే దివ్య ఖుర్‌ఆన్ ధ్యేయం

ఈ గ్రంథం ద్వారా దైవం తన ప్రసన్నతను పొందగోరే వారికై శాంతి మార్గాలను తెరుస్తాడు. వారిని కటిక చీకట్ల నుండి వెలికితీసి, వెలుగులోకి తెస్తాడు. (6: 16)

## మానవ ప్రాణానికి దివ్య ఖుర్‌ఆన్ అత్యంత విలువనిచ్చింది

ఒక్క మనిషిని చంపినా మొత్తం మానవాళిని చంపినట్లేనని ఖుర్‌ఆన్ ప్రకటించింది.

ఒక్క మానవుణ్ణి చంపినవాడు సమస్త మానవులను చంపినట్లే. ఒక మానవుడి ప్రాణాన్ని కాపాడినవాడు మొత్తం మానవుల ప్రాణాలను కాపాడినట్లే. (5: 32)

## సామాజిక రుగ్మతలను రూపుమాపిన గ్రంథం

పురిటిలోనే ఆడ శిశువులను చంపేసే దుర్మార్గాన్ని ఖుర్‌ఆన్ తీవ్రంగా నిరసిస్తుంది. ఆ అమానుషాన్ని అరేబియా ప్రాంతంలో, ప్రపంచంలోని కొన్ని ఇతర ప్రాంతాలలో పూర్తిగా నివారించింది.

పేదరిక భయంతో సంతానాన్ని హత్య చేయడం మహాపాపంగా పేర్కొంటోంది. ఇలాంటి పాపానికి ఒడిగట్టేవారిని అంతిమ దివ్యఖుర్‌ఆన్ తీవ్రంగా మందలిస్తోంది.

దారిద్ర్య భయంతో మీరు మీ సంతానాన్ని చంపేయకండి. మేము వారికీ జీవనోపాధిని ఇస్తున్నాము, మీకూ ఇస్తున్నాము. ముమ్మాటికీ వారి హత్య మహాపాపం. (దివ్య ఖుర్‌ఆన్ 17: 31)

## మద్యం వద్దు

మద్యం, జూదం, అశ్లీలం, వ్యభిచారం, వడ్డీని సమాజం నుండి నిర్మూలించి ఆదర్శ సమాజంగా తీర్చిదిద్దిన గ్రంథం దివ్య ఖుర్‌ఆన్.

వారు నిన్ను మద్యం, జూదాలను గురించి అడుగుతున్నారు. ఈ రెండింటిలోనూ ఎంతో నష్టం ఉందని చెప్పు. వీటిలో ప్రజలకు కొన్ని ప్రయోజనాలున్నా, ఆ ప్రయోజనాల కన్నా నష్టాలే ఎక్కువగా ఉన్నాయి. (2: 219)

## వ్యభిచారం దరిదాపులకు కూడా..

వ్యభిచారం దరిదాపులకు కూడా పోకండి. నిశ్చయంగా అది నీతిమాలిన పోకడ, బహుచెడ్డ మార్గం. (17: 32)

## వడ్డీ అసలే వద్దు

వడ్డీ తినేవారి స్థితి షైతాను పట్టడం వల్ల ఉన్మాది అయిన వ్యక్తి స్థితి లాంటిది. వాస్తవానికి అల్లాహ్ వ్యాపారాన్ని ధర్మసమ్మతం (హలాల్) చేశాడు. వడ్డీని నిషిద్ధం (హరామ్) చేశాడు. (2: 275)

## శత్రువుని మిత్రునిగా మార్చడం

శత్రు వైఖరి కలిగిన వారిని ప్రేమతో, మంచితనంతో ఎదుర్కోమని తన అనుసరులకు దివ్య ఖుర్‌ఆన్ ప్రబోధించింది.

మంచి చెడు ఒకటి కావు. నీవు చెడును శ్రేష్ఠమైన మంచి ద్వారా తొలగించు. అప్పుడు నీపట్ల శత్రుభావం కలవాడు నీకు ప్రాణ స్నేహితుడు అయిపోవటాన్ని నీవు గమనిస్తావు. (41: 34)

మానవులారా! మీ ప్రభువునకు భయపడండి. ఆయన మిమ్మల్ని ఒకే ప్రాణి నుండి పుట్టించాడు. అదే ప్రాణి నుండి దాని జతను సృష్టించాడు. ఇంకా ఆ జంట ద్వారా ఎంతోమంది పురుషులను, స్త్రీలను భూమిపై వ్యాపింపజేశాడు. (4:1)

మగవారికి మహిళలపై ఉన్నటువంటి హక్కులే ధర్మం ప్రకారం మహిళలకు కూడా మగవారిపై ఉన్నాయి. (2: 228)

## దివ్య ఖుర్‌ఆన్ గురించి గాంధీజీ మాటల్లో...

నేను ఖుర్‌ఆన్ చదివాక అర్థం చేసుకున్నది ఏమిటంటే ఇస్లాం హింసాత్మకమైనది కాదు. పైగా శాంతిని కోరేది. ప్రతీకారం కంటే సహనానికి అది పెద్ద పీట వేస్తోంది. ఇస్లాం అంటేనే శాంతి. అంటే అహింస (శాంతిమార్గ్, సంపుటి 25)

మనిషి దైవబోధనలు తెలుసుకుని వాటిని ఆచరించి ఇహపరలోక సాఫల్యం సాధించాలన్నదే అంతిమ దివ్యఖుర్‌ఆన్ బోధనల సారాంశం.

Edited, Printed & Published by S.M. Mallick on behalf of Telugu Islamic Publications, Typeset at "Geeturai Graphics", Printed at Cosmic Printers, Lakkadkot, Hyderabad-2, RNI R.No.37796/81, Postal Regn. No.HSE/422/2023-2025 Phone: 24564583. **e-mail : geeturaiweekly@gmail.com**